www.udyamakeratam.com

PRGI No. : TGTEL/25/A0273

ఉద్యమ కెరటం

నిజం రక్షతి రక్షిత: UDYAMA KERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

| ఆసిఫాబాద్ | సంపుటి: 2 | సంచిక: 153 | 28-11-2026 | శనివారం | పేజీలు: 8 | వెల : రూ.2/-

విద్యుత్ రంగానికి కేంద్రం అండగా నిలవాలి

- రూ.25,096 కోట్ల డీపీఆర్‌లకు 60 రోజుల్లో ఆమోదం తెలపాలి
- పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి సాయం ఇవ్వాలి
- రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

2



మత్తుపై మహా పోరు.. కదిలిన మహానగరం!

- ముగిసిన మూడు రోజుల 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర
- ముగింపు సభకు శ్రీశ్రీ రవిశంకర్, మెగాస్టార్ చిరంజీవి హాజరు
- దాదాపు 40 కిలోమీటర్ల మేర సాగిన పాదయాత్ర



జిమ్ కోచ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష

- మహిళపై నిందితుడు లైంగిక దాడి
- ఫ్లాట్‌లోకి చొరబడి వేధింపులు
- ఫోన్, సోషల్ మీడియా ఖాతాలు హ్యాక్
- రూ.8 వేల జరిమానా విధించిన కోర్టు

2



నిరంతర గస్తీతో నేరాలకు అడ్డుకట్ట!

డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి

నేర సమీక్ష సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్

3





తిండికి కొరత లేదు.. నీటికే కటకట!



ప్రతి అంగుళం భూమికీ పక్కా లెక్క!

- రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ రీసర్వే
- భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం
- మండలానికి రెండు సర్వే బృందాలు
- తెలంగాణ భూ రీసర్వే దేశానికే ఆదర్శం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి

2

- రాష్ట్రంలో తీవ్రంగా నీటి సమస్య
- ఎనిమిది నెలలపాటు నీటిని పొదుపుగా వాడుకోవాలి
- హైడ్రాతో జలవనరులను పరిరక్షిస్తున్నాం
- కాంక్రీట్ అరణ్యంగా మారిన హైదరాబాద్
- డ్రగ్స్, ఆహార కల్తీని ఉపేక్షించేది లేదు
- పరిశుభ్రత లేని హోటళ్లను సీజ్ చేయాలి
- వాతావరణ సవాళ్లను ఎదుర్కొనేందుకు పదేళ్ల కార్యాచరణ
- వాతావరణ మార్పుల సదస్సు సన్నాహక కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): రాష్ట్రంలో ఆహార ధాన్యాలకు కొరత లేకపో యినప్పటికీ నీటి సమస్య తీవ్రంగా ఉందని సీఎం రేవంత్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశా రు. అందుబాటులో ఉన్న నీటిని రాబోయే ఎనిమిది నెలలపాటు అత్యంత జాగ్రత్తగా, పొదుపుగా వినియోగించుకోవాలని సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఐటీసీ కాకతీయలో నిర్వహించిన వాతావరణ మార్పుల సదస్సు సన్నాహక కార్యక్రమంలో సీ ఎం మాట్లాడారు. ప్రస్తుతం ప్రపంచంలోని అనేక దేశాలపై ఎల్‌నినో ప్రభావం ఉ ందని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం వల్ల ప్రకృతి విపత్తులను ఎదుర్కోవాల్సి వస్తోందని అభిప్రాయపడ్డారు. సమస్త జీవరాశిని కాపాడే శక్తి, బాధ్యత రైతులపై ఉందన్నారు. ఒకప్పుడు తెలంగాణలో చెరువులు పుష్కలంగా ఉండేవని, కాలక్రమేణా అవి ఆక్రమణలకు గురయ్యాయని సీఎం పేర్కొన్నారు. హైడ్రా ద్వారా హైదరాబాద్‌లోని జలవనరులను పరిరక్షించడంతో పాటు కబ్జాలకు గురైన చెరువులను పునరుద్ధరిస్తున్నామని వెల్లడించారు.

మిగతా 2 లో

మహిళా, డీలిమిటేషన్ బిల్లులకు కేబినెట్ ఓకే

చట్టసభల్లో 33 శాతం మహిళా కోటా, 50 శాతం సీట్ల పెంపు

ఈ నెల 30 నుంచి జరిగే ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశం

4



సదాశివపేట మున్సిపాలిటీలో ఏసీబీ దాడులు

- రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇద్దరు అధికారులు



.. వివరాలు 3లో

ఒకే వర్గానికి పెద్దపీట!



- కొలీజియంలో ప్రతిభ, వైవిధ్యాన్ని విస్మరిస్తున్నారని ఆరోపణ
- జోక్యం కోరుతూ రాష్ట్రపతి ముర్ముకు మాజీ సీజేఐ గవాయ్ లేఖ

4

Invitation

SMNMA Regd. No. 788/15

TELANGANA SMALL, MEDIUM NEWSPAPERS & MAGAZINES ASSOCIATION

TUWJ

CORDIALLY INVITES YOU

NEWSPAPERS EXHIBITION - 2026

28th November, 2026 (Saturday)

Venue: Deshoddaraka Bhavan, Basheerbagh Press Club, Hyderabad

Inaugural Ceremony: 9:30 AM

PRESIDING OVER

Yusuf Babu
President - TSMNMA

CHIEF GUEST

Sri K. Sreenivas Reddy
Chairman,
Telangana Media Academy

DISTINGUISHED GUESTS

Sri. Alapati Suresh Kumar, Chairman, Press Academy of Andhra Pradesh
Sri Addanki Dayakar, WIP, Telangana Legislative Council
Ms. B. Sumathi, IPS, Commissioner of Police, Malkajgiri
Sri D.S. Jagan, Addl Director I & P R, Govt of Telangana

Special Guests

Sri Devulapalli Amar, Streaming committee member - IJU
Sri. Amer ali khan, Managing Editor, Siasst
Sri K. Virahath Ali, State President, TUWJ
Sri K. Ramnarayana, State General Secretary, TUWJ
Sri Y. Narendra Reddy, Vice President - IJU
Sri M.A. Majid, President, Urdu Journalists Federation
Sri S. Vijay Kumar Reddy, President, Hyderabad Press Club
Sri V. Ramesh, General Secretary, Hyderabad Press Club

YOUR GRACIOUS PRESENCE IS SOLICITED

Y. Lingaiah, General Secretary
Azam Khan, Treasurer

Telangana Small, Medium Newspapers & Magazines Association.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక



కూకట్ పల్లి ట్రక్ పార్క్ వేలానికి హైకోర్టు గ్రీన్ సిగ్నల్

ట్రక్ పార్క్ భూముల వేలంపై దాఖలైన పిటిషన్లు కొట్టివేత

హైదరాబాద్, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి ట్రక్ పార్క్ భూముల వేలానికి తెలంగాణ హైకోర్టులో లైన్ క్లియర్ అయింది. ఈ భూముల వేలాన్ని నిలిపివేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాలను (పిల్స్) హైకోర్టు ధర్మాసనం కొట్టివేసింది. దీంతో హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ నిర్వహించ తలపెట్టిన ఈ-వేలం ప్రక్రియకు మార్గం సుగమమైంది. కూకట్‌పల్లి మండలం మూసాపేట పరిధిలోని దాదాపు 3.15 ఎకరాల ట్రక్ పార్క్ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయాలని నిర్ణయించిన సంగతి తెలిసిందే. అయితే, ఈ భూమిని ప్రైవేటు వ్యక్తులకు లేదా సంస్థలకు విక్రయించవద్దని, ట్రక్ పార్కింగ్ కోసం కేటాయించిన స్థలాన్ని యథాతథంగా ఉంచాలని కోరుతూ కూకట్‌పల్లి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, సామాజిక కార్యకర్త మాధవరం కాంతారావుతో పాటు ట్రక్ పార్క్ అసోసియేషన్ వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ప్రజాప్రయోజనం కోసం సేకరించిన ఈ భూమికి కంచె వేసి రక్షించాలని పిటిషనర్లు కోరారు. ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. ఇరుపక్షాల వాదనలను పరిశీలించింది. ఈ పిటిషన్లలో ఎలాంటి ప్రజా ప్రయోజనం కనిపించడం లేదని న్యాయస్థానం స్పష్టం చేస్తూ వ్యాజ్యాలను కొట్టివేసింది. ప్రత్యక్షంగా ప్రభావితమయ్యే ట్రక్ యజమానులు ఎవరూ కోర్టును ఆశ్రయించలేదని ధర్మాసనం గుర్తుచేసింది. న్యాయపరమైన చిక్కులు తొలగిపోవడంతో, హెచ్ఎండీఏ అధికారిక షెడ్యూల్ ప్రకారం నిర్ణీత సమయానికి ఈ-వేలం నిర్వహణకు సన్నాహాలు పూర్తి చేసింది. ఈ భూమి విక్రయం ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

హెచ్ఎండీఏకు షాక్

కోకాపేట, మూసాపేట భూముల వేలంలో నిరాశ

కోట్ల విలువైన భూములు.. వేలానికి బిడ్డర్లు కరువు!

హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్‌లో మందగమనంపై చర్చ

హైదరాబాద్, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): హైదరాబాద్‌లో ఎప్పుడూ హాట్ కేకుల్లా అమ్ముడయ్యే కోకాపేట, మూసాపేట భూములకు ఈసారి గట్టి షాక్ తగిలింది. హెచ్ఎండీఏ నిర్వహించిన భూముల ఈ-వేలంలో కనీసం ఒక్క బిడ్ కూడా దాఖలు కాకపోవడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఒకప్పుడు ఇక్కడ భూమి దక్కించుకోవడానికి బడా రియల్టర్లు, ఇన్వెస్టర్లు పోటీ పడి వందల కోట్లు కుమ్మరించేవారు. కానీ తాజాగా ఉదయం, మధ్యాహ్నం రెండు విడతలుగా వేలం నిర్వహించినా ఒక్క బిడ్డర్ కూడా ముందుకు రాలేదు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో హెచ్ఎండీఏ అధికారులు ఈ-వేలాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. అధికారులు నిర్ణయించిన భారీ కనీస ధరలే ఇన్వెస్టర్లను వెనక్కి తగ్గేలా చేశాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ వేలంలో భాగంగా మూసాపేట ట్రక్ పార్క్ వద్ద ఉన్న 3.15 ఎకరాల భూమికి ఎకరా కనీస ధరను రూ.99 కోట్లుగా ఫిక్స్ చేశారు. ఇక అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కోకాపేట నియోపోలీస్ లేఅవుట్‌లోని 4.59 ఎకరాల భూమికి ఎకరా కనీస ధర ఏకంగా రూ.120 కోట్లుగా నిర్ణయించారు. అయితే ఈ స్థాయిలో ధరలు పెట్టి భూములు కొనుగోలు చేసేందుకు రియల్ ఎస్టేట్ సంస్థలు, ఇన్వెస్టర్లు ఏమాత్రం ఆసక్తి చూపలేదు. నిజానికి హెచ్ఎండీఏ వేలానికి ఇలాంటి చేదు అనుభవం ఎదురుకావడం ఇది కొత్తేమీ కాదు. ఇటీవల జూబ్లీహిల్స్‌లోని హుడా హైట్స్ భూములకు నిర్వహించిన ఈ-వేలాన్ని కూడా సరైన స్పందన లేకపోవడంతో అధికారులు వాయిదా వేయాల్సి వచ్చింది. వరుసగా ఖరీదైన ప్రాంతాల్లోని భూముల వేలానికి ఇన్వెస్టర్లు దూరంగా ఉండటం హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో నెలకొన్న మందగమనానికి అద్దం పడుతోంది. మరి ఈ పరిస్థితుల్లో హెచ్ఎండీఏ కనీస ధరలను తగ్గించి మళ్లీ వేలం నిర్వహిస్తుందా లేదా అనేది చూడాలి.

జిమ్ కోచ్‌కు 20 ఏళ్ల జైలు శిక్ష

మహిళపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడు



హైదరాబాద్: ఫిట్‌నెస్ శిక్షణ కోసం జిమ్‌కు వచ్చే మహిళపై లైంగిక దాడికి పాల్పడి, అనంతరం ఆమెను బెదిరిస్తూ వేధించిన కోచ్‌కు న్యాయస్థానం జైలు శిక్ష విధించింది. గచ్చిబౌలిలోని రాంకీ టవర్స్ జిమ్‌లో చోటుచేసుకున్న ఈ ఘటనలో నిందితుడు మహ్మద్ మౌజం అలీకి ఎల్బీనగర్‌లోని 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష ఖరారు చేసింది. దీంతోపాటు రూ.8 వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.వాణి తీర్పు వెలువరించారు. గచ్చిబౌలిలోని రాంకీ టవర్స్ జిమ్‌లో మహ్మద్ మౌజం అలీ కోచ్‌గా పనిచేసేవాడు. ఆ జిమ్‌కు వ్యాయామం కోసం వచ్చే ఓ మహిళపై అతడు కన్నేశాడు. 2015లో జిమ్‌లోని మహిళల టాయిలెట్‌లో ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. అనంతరం కూడా బాధితురాలిని వదలకుండా వేధింపులకు దిగాడు. ఆమె నివాస ఫ్లాట్‌లోకి అనుమతి లేకుండా ప్రవేశించి భయపెట్టాడు. బాధితురాలి ఫోన్‌తోపాటు సోషల్ మీడియా ఖాతాలను హ్యాక్ చేసి, వాటిని అడ్డుపెట్టుకుని బ్లాక్‌మెయిల్‌కు పాల్పడ్డాడు. నిందితుడి వేధింపులు భరించలేక బాధితురాలు 2017లో రాయదుర్గం పోలీసులను ఆశ్రయించింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అవసరమైన ఆధారాలు సేకరించి మహ్మద్ మౌజం అలీని అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచారు. కేసు విచారణ సందర్భంగా పోలీసులు సమర్పించిన సాక్ష్యాధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిపై నమోదైన నేరాన్ని నిర్ధారించింది. సుదీర్ఘ విచారణ అనంతరం నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తూ 13వ అదనపు జిల్లా సెషన్స్ జడ్జి ఎం.వాణి తీర్పు ప్రకటించారు. రూ.8 వేల జరిమానా కూడా చెల్లించాలని ఆదేశించారు. వ్యాయామం, ఆరోగ్య పరిరక్షణ కోసం జిమ్‌లను ఆశ్రయించే మహిళల భద్రతకు సంబంధించిన ఈ ఘటనలో వెలువడిన తీర్పు ప్రాధాన్యం సంతరించుకుంది. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన శిక్షకుడే వేధింపులకు పాల్పడటంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తిండికి కొరత లేదు.. నీటికే కటకట!

మొదటి పేజీ తరువాయి

చెరువులు, కాలువలు, లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లు నిర్మించుకోవడం సరికాదన్నారు. హైదరాబాద్ నగరం కాంక్రీట్ అరణ్యంగా మారిపోయిందని, చుక్క నీరు కూడా భూమిలోకి ఇంకకుండా కాంక్రీట్ వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గంట వ్యవధిలో రెండు సెంటీమీటర్ల వర్షం కురిసినా నగరం జలమయమవుతోందన్నారు. పర్యావరణ పరిరక్షణ ఫలితాలను మనం అనుభవించకపోయినా భావితరాలు పొందుతాయని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు, ఆహార కల్తీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని సీఎం స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల నియంత్రణలో తెలంగాణ దేశంలోనే అగ్రస్థానంలో నిలిచిందని పేర్కొన్నారు. డ్రగ్స్ నివారణ తర్వాత ఆహార కల్తీ నియంత్రణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ఇందుకోసమే టీజీ సేఫ్‌ను ఏర్పాటు చేశామని, ఎంతటి పెద్ద హోటల్‌నైనా తనిఖీ చేసే అధికారాలను ఆ సంస్థకు కల్పించామని వెల్లడించారు. పరిశుభ్రత ప్రమాణాలు పాటించని హోటళ్లను వెంటనే సీజ్ చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. ప్రజారోగ్యానికి ముప్పు కలిగించే చర్యలను సహించబోమని స్పష్టం చేశారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని సమర్థంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం పదేళ్ల కార్యాచరణ రూపొందిస్తోంది. డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ ప్రపంచ సదస్సులో ప్రత్యేకంగా వాతావరణ మార్పుల సదస్సును ఏర్పాటు చేయనుంది. ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కోవడం, జల భద్రత, కరువు నివారణ, వాతావరణ అనుకూల వ్యవసాయం, హరిత వృద్ధి అనే ఐదు ప్రధాన అంశాలపై చర్చించనున్నారు. ఈ సదస్సు ద్వారా 2026-2036 తెలంగాణ వాతావరణ స్థితిస్థాపకత కార్యాచరణ రూపకల్పనకు పునాది వేయనున్నారు. ప్రకృతి విపత్తులు సంభవించిన తర్వాత స్పందించే విధానానికి బదులుగా ముందస్తు సన్నద్ధత, శాస్త్రీయ ప్రణాళిక, ప్రభుత్వ శాఖల సమన్వయంతో వాతావరణ సవాళ్లను ఎదుర్కొనే దిశగా ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న ప్రతి ఒక్కరికీ సీఎం అభినందనలు, ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ వ్యవస్థాపకుడు



శ్రీశ్రీ రవిశంకర్, సేంద్రీయ వ్యవసాయ నిపుణుడు చింతల వెంకట్ రెడ్డి, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీతక్క తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అంగుళం భూమికీ పక్కా లెక్క!

- **ఏడాదిన్నరలో రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భూ రీసర్వే**
- **భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యం**
- **మండలానికి రెండు సర్వే బృందాలు**
- **తెలంగాణ భూ రీసర్వే దేశానికే ఆదర్శం**
- **మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి**



హైదరాబాద్, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): రాష్ట్రంలో తరతరాలుగా కొనసాగుతున్న భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు చేపట్టిన సమగ్ర భూ రీసర్వే దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని శాస్త్రీయ పద్ధతుల్లో కొలిచి, ఏడాదిన్నర వ్యవధిలో సర్వే పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు వెల్లడించారు. శుక్రవారం సచివాలయంలో మీడియా ప్రతినిధులతో ఆయన మాట్లాడారు. తొలి విడతలో భూముల మ్యాపులు అందుబాటులో లేని 373 గ్రామాల్లో సర్వే ప్రారంభించామని, డిసెంబర్ నెలాఖరుకు ఈ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. రీసర్వేను సమర్థంగా నిర్వహించేందుకు ఇప్పటికే తొమ్మిది ఉమ్మడి జిల్లాల్లో పర్యటించి ప్రజాప్రతినిధులతో సమావేశాలు నిర్వహించినట్లు మంత్రి వెల్లడించారు. ఒక్కో సమావేశం నాలుగు నుంచి ఆరు గంటలపాటు కొనసాగిందని, భూముల విస్తీర్ణంలో వ్యత్యాసాలు, సరిహద్దు వివాదాలు, రైతుల అభ్యంతరాలపై చర్చించామని తెలిపారు. కొలతల్లో తేడాలు గుర్తించినప్పుడు రైతుల మధ్య వివాదాలు తలెత్తకుండా కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, ఆర్డీఓలు, తహసీల్దార్లు చొరవ తీసుకుని పరిష్కరించాలని ఆదేశించినట్లు చెప్పారు. వీటిని రూపొందిస్తామన్నారు. ప్రతి పాస్ పుస్తకానికి ప్రత్యేక క్యూఆర్ కోడ్ కేటాయిస్తామని, దాన్ని స్కాన్ చేస్తే భూమికి సంబంధించిన సర్వే నంబర్, విస్తీర్ణం, మ్యాప్ తదితర వివరాలు తెలుసుకోవచ్చని చెప్పారు. ఒకే యజమానికి చెందిన వేర్వేరు సర్వే నంబర్లలోని భూముల వివరాలను ఒకే పాస్ పుస్తకంలో ప్రత్యేక పేజీల్లో పొందుపరుస్తామని తెలిపారు. వ్యవసాయ భూములతోపాటు గ్రామాల్లోని నివాస స్థలాలు, ఇళ్లు, ఆబాదీ ఆస్తులకు కూడా సమగ్ర సర్వే చేపడతామని మంత్రి వెల్లడించారు. చిన్న స్థలం ఉన్నవారికైనా మ్యాప్‌తో కూడిన ఆస్తి గుర్తింపు పత్రాన్ని అందిస్తామన్నారు. వ్యవసాయ భూములకు ఒక రంగులో, నివాస ఆస్తులకు మరో రంగులో ప్రత్యేక పాస్ పుస్తకాలు జారీ చేసే ప్రతిపాదన ఉందని చెప్పారు. గతంలో మండలానికి ఒక సర్వే బృందం మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్యను రెండుకు పెంచినట్లు తెలిపారు. తొలి దశలో ఎదురైన సాంకేతిక, క్షేత్రస్థాయి సమస్యలను అధిగమించి తదుపరి విడతల్లో సర్వేను వేగవంతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి రైతులు, ప్రజాప్రతినిధులు, మీడియా సహకరించాలని కోరారు. ఇళ్ల కేటాయింపులో తెలంగాణపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వివక్ష చూపుతోందని పొంగులేటి ఆరోపించారు. రాష్ట్రానికి 13 లక్షల ఇళ్లు కేటాయించాలని కోరితే కేవలం రెండు లక్షల ఇళ్లే మంజూరు చేశారని విమర్శించారు. గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు 17 లక్షల ఇళ్లు కేటాయించారని, తాజాగా ఏపీకి నాలుగు లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. తిరిగి అధికారంలోకి వస్తామని బీఆర్ఎస్ నేతలు పగటి కలలు కంటున్నారని వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వానికి ఎవరిపైనా కక్ష సాధింపు ధోరణి లేదని, నిర్ణయాలు తీసుకోవడంలో ఆలస్యమైనా శాస్త్రీయంగా, నిజాయతీగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

విద్యుత్ రంగానికి కేంద్రం అండగా నిలవాలి

- **రూ.25,096 కోట్ల డీపీఆర్‌లకు 60 రోజుల్లో ఆమోదం తెలపాలి**
- **పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి సాయం ఇవ్వాలి**
- **రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క**



న్యూఢిల్లీ, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): తెలంగాణలో పెరుగుతున్న విద్యుత్ అవసరాలకు అనుగుణంగా ఉత్పత్తి, ప్రసార, పంపిణీ వ్యవస్థలను బలోపేతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందించాలని డిప్యూటీ సీఎం, ఇంధన శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క కోరారు. శుక్రవారం న్యూఢిల్లీలోని అశోకా హోటల్‌లో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రాల విద్యుత్ శాఖ మంత్రుల సదస్సులో ఆయన పాల్గొన్నారు. స్మార్ట్ మీటర్ల ఏర్పాటు, విద్యుత్ పంపిణీ నష్టాల తగ్గింపు, వ్యవసాయ ఫీడర్ల సౌరీకరణ, ప్రభుత్వ విద్యుత్ బకాయిల చెల్లింపు, విద్యుత్ నిల్వ సామర్థ్యం పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని వివరించారు. విద్యుత్ పంపిణీ వ్యవస్థల ఆధునికీకరణ పథకం (ఆర్డీఎస్ఎస్) కింద రూ.25,096 కోట్ల విలువైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలను ఈ ఏడాది మే 27న పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సమర్పించినట్లు భట్టి తెలిపారు. ఈ పథకం కింద తెలంగాణకు ఇప్పటివరకు రూ.72 కోట్ల బడ్జెట్ సహాయం మాత్రమే అందిందన్నారు. పెండింగ్‌లో ఉన్న డీపీఆర్‌లకు 60 రోజుల్లో ఆమోదం తెలపడంతోపాటు పనుల అమలుకు 2028 మార్చి 31 వరకు గడువు కల్పించాలని కోరారు. దేశంలో 92 గిగావాట్ అవర్ల విద్యుత్ నిల్వ సామర్థ్యం కోసం రూ.14,500 కోట్ల ఆర్థిక సహాయం అందించాలన్న కేంద్ర మంత్రివర్గ నిర్ణయాన్ని భట్టి స్వాగతించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు ప్రస్తుత మార్గదర్శకాల ప్రకారం ఆర్థిక సహాయం అందే అవకాశం లేదని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ రంగ సంస్థలు చేపట్టే ప్రాజెక్టులకు మెగావాట్‌కు రూ.కోటి చొప్పున ఆర్థిక సహాయం అందించాలని కోరారు. టీజీజెన్‌కో చేపట్టనున్న కల్వూరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుకు త్వరితగతిన ఆమోదం తెలపడంతోపాటు రాష్ట్రంలో టెండర్ల దశలో ఉన్న 2,000 మెగావాట్ అవర్ల బ్యాటరీ విద్యుత్ నిల్వ ప్రాజెక్టులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ రంగ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టులకు సహాయం అందించాలన్న విజ్ఞప్తిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార ఛార్జీల్లో భారీ హెచ్చుతగ్గులు రాష్ట్రాల ఆర్థిక ప్రణాళికపై ప్రభావం చూపుతున్నాయని భట్టి పేర్కొన్నారు. తెలంగాణకు కేటాయించిన 5,801 మెగావాట్ల నెట్‌వర్క్ యాక్సెస్‌లో మార్పు లేకపోయినా 2025 అక్టోబర్‌లో రూ.195 కోట్లు, నవంబర్‌లో రూ.145 కోట్ల ప్రసార ఛార్జీలు విధించారని వివరించారు. రాష్ట్రాల వారీగా ఛార్జీల లెక్కింపును ప్రతి నెలా వెల్లడించాలని, వార్షిక ప్రాతిపదికన ఛార్జీలను నిర్ణయించాలని కోరారు. ఇప్పటికే చెల్లించిన బిల్లులను తిరిగి లెక్కించి అదనపు ఛార్జీలు విధించే విధానానికి స్వస్తి పలకాలన్నారు. దక్షిణాదికి 6 వేల మెగావాట్ల విద్యుత్‌ను అందించే రాయ్‌గఢ్-పుగళూర్-త్రిస్సూర్ హెచ్‌వీడీసీ ప్రసార వ్యవస్థకు పూర్తిస్థాయి జాతీయ హోదా కల్పించాలని కోరారు. తెలంగాణలో 23,480 ఎంవీఏ సామర్థ్యం కలిగిన హరిత విద్యుత్ కారిడార్ ప్రాజెక్టులకు తొలి విడతలోనే ఆమోదం తెలపాలన్నారు. సేడం-పరిగి విద్యుత్ ప్రసార లైన్, మహేశ్వరం-2 సబ్‌స్టేషన్‌ను అంతర్రాష్ట్ర విద్యుత్ ప్రసార ప్రాజెక్టులుగా చేపట్టి, వాటి వ్యయాన్ని జాతీయ స్థాయిలో పంచుకోవాలని విజ్ఞప్తి చేశారు. పునరుత్పాదక విద్యుత్ ప్రాజెక్టులకు అంతర్రాష్ట్ర ప్రసార ఛార్జీల మినహాయింపును 2030 మార్చి 31 వరకు పొడిగించాలని కోరారు. ఎల్‌నినో ప్రభావంతో ఈ ఏడాది సెప్టెంబర్‌లో జలవిద్యుత్ ఉత్పత్తి గతేడాదితో పోలిస్తే సుమారు 20 శాతం తగ్గగా, బొగ్గు ఆధారిత విద్యుత్ ఉత్పత్తి 13.3 శాతం పెరిగిందని భట్టి వివరించారు. దేశవ్యాప్తంగా సెప్టెంబర్‌లో 56 కోట్ల యూనిట్ల విద్యుత్ కొరత నమోదైందన్నారు. రానున్న వేసవిలో విద్యుత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని 2027 ఫిబ్రవరి 1 నుంచి ఏప్రిల్ 30 వరకు దేశంలోని అన్ని గ్యాస్ ఆధారిత విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను వినియోగించేలా కేంద్రం ఆదేశాలు జారీ చేయాలని కోరారు. ఇందుకు అవసరమైన గ్యాస్ సరఫరాకు ముందస్తు ఏర్పాట్లు చేయడంతోపాటు అదనపు వ్యయాన్ని ఏ ఒక్క రాష్ట్రంపైనా మోపకుండా ఉమ్మడి విధానాన్ని అమలు చేయాలని సూచించారు. సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, టీజీ ట్రాన్స్‌కో సీఎండీ, ఉప ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి కృష్ణ భాస్కర్ పాల్గొన్నారు.

బిల్లుకు ఆమోదం రాకపోతే..

జనాభా ప్రకారమే సీట్ల పెంపు

బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్

హైదరాబాద్, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): డీలిమిటేషన్ అంశంపై బీజేపీ రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్‌లో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. రాబోయే డీలిమిటేషన్‌కు సంబంధించి పార్లమెంట్‌లో డిసెంబర్ నాటికి బిల్లు ఆమోదం పొందకపోతే, ఆ తర్వాత సీట్ల పెంపు ప్రక్రియను జనాభాకు అనుగుణంగానే చేపట్టాల్సి వస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఉత్తరాది ప్రజలు తమ జనాభా నిష్పత్తి ప్రకారమే డీలిమిటేషన్ చేయాలని ఆందోళనలు ప్రారంభిస్తే పరిస్థితి ఏంటని లక్ష్మణ్ ప్రశ్నించారు. ప్రస్తుతం కొందరు దక్షిణాది, ఉత్తరాది అంటూ ప్రాంతీయ విభేదాలు, తారతమ్యాలు సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఒక్కో రాష్ట్రానికి ఒకే ఎంపీ ఉన్న పరిస్థితులను కూడా గమనించాలని సూచించారు. జీడీపీని ప్రాతిపదికగా తీసుకుని ఎంపీ సీట్లను పెంచాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేస్తున్న ప్రతిపాదనను లక్ష్మణ్ ప్రశ్నించారు. జీడీపీ అనేది ప్రతి ఏటా మారుతూ ఉంటుందని, అలాంటప్పుడు ఎంపీ సీట్లను కూడా ప్రతి సంవత్సరం పెంచడం లేదా తగ్గించడం సాధ్యమేనా అని నిలదీశారు. సాధారణంగా డీలిమిటేషన్ ప్రక్రియ ప్రతి పదేళ్లకు ఒకసారి జరుగుతుందని గుర్తుచేశారు. నియోజకవర్గాల సంఖ్య పెరిగితే చట్టసభల్లో ఎస్సీ, ఎస్టీ వర్గాలకు కూడా ప్రాతినిధ్యం, రిజర్వ్‌డ్



స్థానాలు పెరుగుతాయని... తద్వారా ఆయా వర్గాల గొంతు మరింత బలంగా వినిపిస్తుందని లక్ష్మణ్ వివరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లును గతంలో అడ్డుకున్న కాంగ్రెస్, వామపక్షాలు, మమతా బెనర్జీలకు ప్రజలు ఎన్నికల్లో తగిన సమాధానం చెప్పారని ఆయన వ్యాఖ్యానించారు.

నిరంతర గస్తీతో నేరాలకు అడ్డుకట్ట!

- డ్రగ్స్, సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి
- నేరాలు అధికంగా జరిగే ప్రాంతాల్లో నిఘా పెంచాలి
- నూతన పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి
- కామారెడ్డి పోలీసుల పనితీరుపై డీజీపీ ప్రశంసలు
- నేర సమీక్ష సమావేశంలో డీజీపీ సీవీ ఆనంద్



కామారెడ్డి, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): క్షేత్రస్థాయిలో పోలీసులు నిరంతరం గస్తీ నిర్వహించడం ద్వారా నేరాలకు అడ్డుకట్ట వేయవచ్చని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. ఆస్తి సంబంధిత నేరాల నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని, నేరాలు అధికంగా జరిగే ప్రాంతాలను గుర్తించి గస్తీ పెంచాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కామారెడ్డి జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన నేర సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన నగదును తిరిగి రాబట్టడంలో, పోక్సో సహా వివిధ కేసుల్లో నిందితులకు శిక్షలు పడేలా చేయడంలో కామారెడ్డి పోలీసులు చూపుతున్న పనితీరును అభినందించారు. గతంలో ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మూడున్నరేళ్లపాటు విధులు నిర్వహించిన అనుభవాలను గుర్తుచేసుకున్న డీజీపీ.. అప్పట్లో నక్సల్స్ సమస్య తీవ్రంగా ఉన్నప్పటికీ సమష్టి కృషితో మూడు ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. ప్రస్తుతం సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల నియంత్రణ పోలీసులకు ప్రధాన సవాళ్లుగా మారాయని డీజీపీ పేర్కొన్నారు. మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలతో కామారెడ్డి జిల్లాకు సరిహద్దులు ఉండటంతో అంతరాష్ట్ర నేర ముఠాల కదలికలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. గతంలో ఏటా 10 నుంచి 15 ముఠాలు జిల్లాలో సంచరించేవని, వాటి కట్టడికి చేపట్టిన ఆపరేషన్ కవచ్ మంచి ఫలితాలనిస్తోందని తెలిపారు. 2029 డిసెంబర్ 31 నాటికి మాదకద్రవ్యాల రహిత భారత్ నిర్మాణమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. కానిస్టేబుల్ నుంచి ఎస్పీ స్థాయి వరకు మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. జిల్లాలో మాదకద్రవ్యాల బాధితుల పునరావాస కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కృత్రిమ మేధ సాంకేతికతను వినియోగించుకుంటూ సైబర్ నేరగాళ్లు కొత్త తరహా మోసాలకు పాల్పడుతున్నారని డీజీపీ హెచ్చరించారు. సుమారు 40 రకాల సైబర్ మోసాల ద్వారా ప్రజల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని తెలిపారు. బాధితులకు తక్షణ సహాయం అందించడంతోపాటు నగదు రికవరీకి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సముదాయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కామారెడ్డి పట్టణంలో మరో పోలీస్‌స్టేషన్‌తోపాటు బాన్సువాడలో అదనపు పోలీస్‌స్టేషన్, ట్రాఫిక్, మహిళా పోలీస్‌స్టేషన్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. కేసుల నమోదు, దర్యాప్తులో సీసీటీఎన్ఎస్, ఈ-సాక్ష వంటి సాంకేతిక వ్యవస్థలను సమర్థంగా వినియోగించుకోవాలని సూచించారు. ఫిట్‌కాప్ కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 75 వేల మందికి పైగా పోలీసు సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో నేరాల నియంత్రణ, దర్యాప్తు, శాంతిభద్రతల పరిరక్షణకు చేపడుతున్న చర్యలను ఎస్పీ రాజేష్ చంద్ర వివరించారు. జిల్లాకు 1,158 పోస్టులు మంజూరు కాగా, ప్రస్తుతం 976 మంది విధులు నిర్వహిస్తున్నారని, 182 పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన నగదులో 2024లో 55 శాతం, 2025లో 69 శాతం, 2026 నవంబర్ నాటికి 61 శాతం రికవరీ చేసినట్లు వెల్లడించారు. ఈ ఏడాది 7,285 మొబైల్ ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు అందగా, 3,683 ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మొబైల్ ఫోన్ల రికవరీలో రాష్ట్రంలో కామారెడ్డి జిల్లా ఏడో స్థానంలో ఉందన్నారు. కామారెడ్డి టౌన్, దేవునిపల్లి, బాన్సువాడ, బిచ్కుంద, బిక్కనూరు పోలీస్‌స్టేషన్ల పరిధిలోనే జిల్లా మొత్తం నేరాల్లో 42 శాతం నమోదవుతున్నట్లు వివరించారు. జిల్లాలో ప్రమాదాలు అధికంగా జరిగే 25 ప్రాంతాలను గుర్తించి నివారణ చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. బాన్సువాడలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగిన మతపరమైన ఘర్షణలకు సంబంధించి 17 కేసులు నమోదు చేసి 41 మందిని అరెస్టు చేసినట్లు వెల్లడించారు. ఇటీవల 400 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని, నిందితుల ఆస్తుల జప్తునకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ఏడాది నవంబర్ నాటికి అక్రమ ఇసుక రవాణాపై 193 కేసులు నమోదు చేసి 281 వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అక్రమ గేమింగ్‌పై 376 కేసులు నమోదు చేయడంతోపాటు 135 రౌడీషీట్లు తెరిచినట్లు వివరించారు. సమావేశంలో కొత్త నేర చట్టాల అమలు, మాదకద్రవ్యాల కేసుల దర్యాప్తు, సామాజిక మాధ్యమాలపై నిఘా తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, ఐజీ కార్తికేయ, సీఐడీ డీఐజీ నారాయణ నాయక్, జోన్--3 డీఐజీ సన్‌ప్రీత్ సింగ్, కామారెడ్డి ఎస్పీ రాజేష్ చంద్ర, సైబర్ సెక్యూరిటీ ఎస్పీ హర్షవర్ధన్, ఎస్పీ ప్రవీణ్ కుమార్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్ తదితరులు పాల్గొన్నారు.

మత్తుపై మహా పోరు.. కదిలిన మహానగరం!

- ముగిసిన మూడు రోజుల 'నషా ముక్త్ భారత్' పాదయాత్ర
- దాదాపు 40 కిలోమీటర్ల మేర సాగిన పాదయాత్ర
- రాజకీయాలకు అతీతంగా మాదకద్రవ్యాలపై పోరాటం
- యువత భవిష్యత్తును కాపాడటం అందరి బాధ్యత
- ముగింపు సభకు శ్రీశ్రీ రవిశంకర్, మెగాస్టార్ చిరంజీవి





హైదరాబాద్, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): మాదకద్రవ్యాల రహిత భారతదేశ నిర్మాణమే లక్ష్యంగా హైదరాబాద్‌లో చేపట్టిన 'నషా ముక్త్ భారత్' మూడు రోజుల పాదయాత్ర శుక్రవారం ముగిసింది. వివిధ వర్గాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి దాదాపు 40 కిలోమీటర్ల మేర పాదయాత్రలో పాల్గొన్నారు. 2029 నాటికి మాదకద్రవ్యాల రహిత భారతదేశాన్ని నిర్మించాలన్న ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా సంకల్పానికి మద్దతుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాదకద్రవ్యాల సమస్యను రాజకీయాలకు అతీతంగా చూడాలని, దేశంలోని దాదాపు 70 కోట్ల మంది యువత భవిష్యత్తును కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని నిర్వాహకులు పేర్కొన్నారు. విద్యార్థులు వ్యసనాల బారిన పడకుండా వారి ఆశయాలను సాకారం చేసుకునేందుకు సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాలన్నారు. పాదయాత్రకు హైదరాబాద్ ప్రజల నుంచి లభించిన విశేష స్పందన మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి మరింత బలాన్నిచ్చిందని తెలిపారు. ముగింపు సభకు హాజరైన ఆధ్యాత్మిక గురువు శ్రీశ్రీ రవిశంకర్ మానసిక దృఢత్వం, సంపూర్ణ ఆరోగ్యకర జీవన విధానం ప్రాధాన్యాన్ని వివరించారు. ఆయన మార్గదర్శనం మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమానికి స్ఫూర్తినిచ్చిందని నిర్వాహకులు పేర్కొన్నారు. మెగాస్టార్ చిరంజీవి తన జీవిత అనుభవాలను పంచుకుంటూ స్నేహితుల ప్రభావంతో ప్రారంభమయ్యే దురలవాట్లు క్రమంగా వ్యసనాలుగా మారి వ్యక్తుల భవిష్యత్తుతో పాటు కుటుంబాల జీవితాలను కూడా నాశనం చేస్తాయని హెచ్చరించారు. కార్యక్రమంలో మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్ విద్యాసాగర్ రావు, పద్మవిభూషణ్ పురస్కార గ్రహీత డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి, రామకృష్ణ మఠం అధ్యక్షుడు స్వామి బోధమయానంద, ప్రముఖ దర్శకుడు సుకుమార్, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రామచందర్ రావు, ఎంపీలు ఈటల రాజేందర్, రఘునందన్ రావు, బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎమ్మెల్యేలు కాటిపల్లి వెంకటరమణారెడ్డి, రామారావు పటేల్, ధన్‌పాల్ సూర్యనారాయణ, ఎమ్మెల్సీలు అంజిరెడ్డి, మల్క కొమురయ్య, సీనియర్ నేత చింతల రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బిర్యానీ వడ్డించే వంటగదిలో ఇంత అపరిశుభ్రతా!

కరీంనగర్‌లోని క్లాసిక్ అభిరుచి రెస్టారెంట్ లైసెన్స్ సస్పెన్షన్

ఆహార భద్రతా అధికారుల తనిఖీల్లో విస్తుపోయే వాస్తవాలు

శీతలీకరణ యంత్రంలో గడ్డకట్టిన మాంసపు రక్తం

నిమ్మకాయలపై బూజు.. బిర్యానీలో ఆహార రంగులు



కరీంనగర్, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): ప్రజారోగ్యానికి ముప్పు కలిగించేలా ఆహార పదార్థాలను తయారు చేస్తూ, తీవ్ర అపరిశుభ్ర పరిస్థితుల్లో నిర్వహిస్తున్న కరీంనగర్ వావిలాలపల్లిలోని క్లాసిక్ అభిరుచి మల్టీ క్యూజిన్ ఫ్యామిలీ రెస్టారెంట్‌పై ఆహార భద్రతా అధికారులు చర్యలు తీసుకున్నారు. శుక్రవారం నిర్వహించిన తనిఖీల్లో ఆహార భద్రత, పరిశుభ్రత నిబంధనలకు సంబంధించి 14 ఉల్లంఘనలను గుర్తించారు. వాటి తీవ్రతను పరిగణనలోకి తీసుకుని రెస్టారెంట్ ఎఫ్ఎస్ఎస్ఏఐ లైసెన్స్ (13621002000175)ను తక్షణమే నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. పచ్చి గుడ్లతో మయోనైజ్ తయారు చేయడం, బిర్యానీతో పాటు ఇతర వంటకాల తయారీలో ఆహార రంగులు వినియోగించడం, నిమ్మకాయలపై బూజు పెరగడం వంటి లోపాలను అధికారులు గుర్తించారు. మాంసాన్ని అత్యంత అపరిశుభ్ర పరిస్థితుల్లో నిల్వ చేయడంతో పాటు శీతలీకరణ యంత్రం అడుగుభాగంలో పాత మాంసం నుంచి కారిన రక్తం గడ్డకట్టినట్లు వెల్లడించారు. సుమారు 30 కిలోల ఆహార, మాంస పదార్థాలను ఎలాంటి గుర్తింపు లేకుండా నిల్వ చేసినట్లు తెలిపారు. పన్నీర్‌పై లేబుళ్లు లేకపోవడం, పలు ఆహార పదార్థాలను మూతలు లేకుండా బహిరంగంగా ఉంచడాన్ని గుర్తించారు. వంటగదిలోని ఫ్యాన్లపై దుమ్ము, ఎగ్జాస్ట్ ఫ్యాన్లపై మసి పేరుకుపోయినట్లు అధికారులు పేర్కొన్నారు. మురుగునీటి కాలువలు మూసుకుపోవడం, నేల దెబ్బతినడం, కూరగాయలు కోసే పలకలు అపరిశుభ్రంగా ఉండటం వంటి లోపాలు బయటపడ్డాయి. మరుగుదొడ్లకు ఆనుకుని పాత్రలు, వంట పరికరాలు ఉంచడంతో అవి కలుషితమయ్యే ప్రమాదముందని తెలిపారు. ఆహార తయారీ సిబ్బంది చేతి తొడుగులు, తలకు రక్షణ కవచాలు ధరించకపోవడాన్ని కూడా గుర్తించారు. ప్రజారోగ్యానికి ఏర్పడే ముప్పును దృష్టిలో ఉంచుకుని సస్పెన్షన్ కాలంలో రెస్టారెంట్‌లో ఆహార పదార్థాల తయారీ, నిల్వ, విక్రయం, పంపిణీ, వడ్డన పూర్తిగా నిలిపివేయాలని అధికారులు ఆదేశించారు. గుర్తించిన లోపాలను సరిదిద్దడంతో పాటు ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. కేవలం నిబంధనలు పాటించినట్లు నివేదిక సమర్పించినంత మాత్రాన రెస్టారెంట్‌ను తిరిగి ప్రారంభించరాదని, సంబంధిత అధికారి నుంచి లిఖితపూర్వక అనుమతి పొందిన తర్వాతే కార్యకలాపాలు ప్రారంభించాలని కరీంనగర్ ఆహార భద్రతా విభాగం వెల్లడించింది.



లోటస్ పాండ్ పార్కు స్థలంపై వివాదం..

పనులను అడ్డుకున్న స్థానికులు

హైదరాబాద్, నవంబర్ 27: నగరంలోని ఖరీదైన ప్రాంతాల్లో ఒకటైన జూబ్లీహిల్స్‌లోని లోటస్ పాండ్ సమీప పార్కు స్థలంపై వివాదం నెలకొంది. వేల కోట్ల రూపాయల విలువైన ఈ స్థలాన్ని ప్రభుత్వం వేలం వేయడానికి సిద్ధమైందని, పోలీసు బందోబస్తు మధ్య అభివృద్ధి పనులు చేపడుతోందని స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. పార్కులోని చెట్లను తొలగించి, జేసీబీలతో స్థలాన్ని చదును చేస్తుండటంతో కాలనీవాసులు అక్కడికి చేరుకుని పనులను అడ్డుకున్నారు. అధికారుల చర్యలకు నిరసనగా ఆందోళన చేపట్టడంతో ప్రాంతంలో ఉద్రిక్తత ఏర్పడింది. ఈ వ్యవహారంపై స్థానికులతో కలిసి పోరాడుతున్న మాజీ ఐపీఎస్ అధికారి యోగానంద్ ప్రభుత్వ చర్యలను ప్రశ్నించారు. ఈ నెల 24న ప్రధాన దినపత్రికల మొదటి పేజీల్లో ప్రభుత్వం ప్రకటన ఇచ్చి, లోటస్ పాండ్ సమీపంలోని సుమారు 10,150 గజాల స్థలాన్ని వేలం వేయనున్నట్లు వెల్లడించిందని తెలిపారు. గతంలోనూ ఈ భూమిని విక్రయించేందుకు ప్రయత్నించగా తాము న్యాయస్థానాన్ని ఆశ్రయించామని గుర్తుచేశారు. అప్పట్లో ఈ స్థలాన్ని పార్కుగా మాత్రమే అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం కోర్టుకు స్పష్టమైన హామీ ఇచ్చిందని పేర్కొన్నారు. న్యాయస్థానానికి ఇచ్చిన హామీకి విరుద్ధంగా ఇప్పుడు మళ్లీ వేలం ప్రక్రియ చేపట్టడంపై యోగానంద్ అభ్యంతరం వ్యక్తం చేశారు. వేలం ప్రకటనలో స్థలానికి 40 గజాల రోడ్డు ఉన్నట్లు చూపించారని, వాస్తవానికి అక్కడ రోడ్డు లేదని ఆరోపించారు. ప్రస్తుతం స్థలాన్ని చదును చేసి కొత్తగా రోడ్డు నిర్మిస్తున్నారని పేర్కొన్నారు. అలాగే అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ సౌకర్యం ఉన్నట్లు ప్రకటనలో వివరించారని, కానీ లోటస్ పాండ్ నుంచి వచ్చే అదనపు నీరు నేరుగా ఈ స్థలంలోకి చేరి నిలుస్తోందని వివరించారు. పార్కు స్థలాన్ని వాణిజ్య అవసరాలకు మళ్లించి విక్రయించే ప్రయత్నాలను అడ్డుకుంటామని స్థానికులు స్పష్టం చేస్తున్నారు. చెట్ల తొలగింపు, స్థలాన్ని చదును చేసే పనులను నిలిపివేయాలని డిమాండ్ చేస్తున్నారు. పోలీసుల బందోబస్తు మధ్య కొనసాగుతున్న పనులపై స్థానికుల నిరసన నేపథ్యంలో ఈ వివాదం మరింత చర్చనీయాంశంగా మారింది.

సదాశివపేట మున్సిపాలిటీలో ఏసీబీ దాడులు

రూ.15 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఇద్దరు అధికారులు



సదాశివపేట, నవంబర్ 27: సంగారెడ్డి జిల్లా సదాశివపేట మున్సిపాలిటీలో అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించారు. రూ.15 వేల లంచం తీసుకుంటూ మున్సిపాలిటీకి చెందిన ఇద్దరు అధికారులు ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ఏసీబీ విడుదల చేసిన ప్రెస్‌నోట్ ప్రకారం సదాశివపేట మున్సిపాలిటీలో పబ్లిక్ హెల్త్ అసిస్టెంట్ ఇంజనీర్‌గా పనిచేస్తున్న రాజేష్ కుమార్ (ఏవో-1), ఔట్‌సోర్సింగ్ విధానంలో వర్క్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న శివారెడ్డి (ఏవో-2) లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. 2025లో గణేశ్ నిమజ్జన కార్యక్రమం సందర్భంగా సంగారెడ్డి పట్టణంలోని ఉబా చెరువులో చేపట్టిన పూడికతీత పనులకు సంబంధించి రూ.4.50 లక్షల కాంట్రాక్ట్ బిల్లును ఇప్పటికే మంజూరు చేసి ప్రాసెస్ చేసినందుకు ప్రతిఫలంగా ఏవో-1 రాజేష్ కుమార్ ఫిర్యాదుదారుడిని రూ.15 వేల లంచం డిమాండ్ చేసి స్వీకరించినట్లు ఏసీబీ వెల్లడించింది. అనంతరం ఆ మొత్తాన్ని భద్రపరిచేందుకు ఏవో-2 శివారెడ్డికి అప్పగించారు. ఈ క్రమంలో శుక్రవారం మధ్యాహ్నం సుమారు 2.30 గంటల సమయంలో మున్సిపల్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు ఇద్దరినీ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్ము రూ.15 వేలను ఏవో-2 శివారెడ్డి వద్ద నుంచి ఏసీబీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అధికారులు తమ విధులను నిజాయితీగా నిర్వహించకుండా అక్రమ ప్రయోజనం పొందేందుకు పాల్పడినట్లు ఏసీబీ పేర్కొంది. అనంతరం ఇద్దరు నిందితులను అరెస్టు చేసి హైదరాబాద్‌లోని ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల విచారణ ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరచనున్నట్లు వెల్లడించింది. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని, ఫిర్యాదుదారుడి వివరాలను భద్రతా కారణాల దృష్ట్యా గోప్యంగా ఉంచినట్లు ఏసీబీ తెలిపింది.

ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

సంపాదకీయం



డీలిమిటేషన్ పోరు..
మారుతున్న రాజకీయ లెక్కలు!

దేశ రాజకీయ ముఖచిత్రాన్ని సమూలంగా మార్చేసే నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్), మహిళా రిజర్వేషన్ బిల్లులు మరోసారి పార్లమెంటు వేదికగా రసవత్తర చర్చకు తెరలేపుతున్నాయి. శుక్రవారం కేంద్ర మంత్రివర్గం ఈ రెండింటికీ ఆమోదముద్ర వేయడంతో, నవంబర్ 30 నుంచి డిసెంబర్ 3 వరకు జరిగే ప్రత్యేక సమావేశాలపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. 2029 నుంచి మహిళా రిజర్వేషన్ల అమలు, లోక్‌సభ స్థానాల గరిష్ఠ సంఖ్యను 850కి పెంచేలా కేంద్రం కొత్త బిల్లును సిద్ధం చేసింది. ఏప్రిల్ 17న ఓటింగ్‌లో ఎదురుదెబ్బ తగిలిన నేపథ్యంలో, ఈసారి 'మిషన్ 360' కోసం కేంద్రం వ్యూహాత్మకంగా పావులు కదుపుతుండగా, ప్రాంతీయ, విపక్ష పార్టీల వైఖరుల్లో కదలికలు ఆసక్తి రేకెత్తిస్తున్నాయి.

ఏప్రిల్ అనుభవం.. సంఖ్యాబలం లెక్కలు

రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే సభకు హాజరై ఓటు వేసే సభ్యుల్లో మూడింట రెండొంతుల మెజారిటీ తప్పనిసరి. ఏప్రిల్ 17న 528 మంది ఓటింగ్‌లో పాల్గొనగా, అనుకూలంగా 298, వ్యతిరేకంగా 230 ఓట్లు పోలయ్యాయి. అవసరమైన 352 ఓట్ల మార్కుకు కేంద్రం 54 ఓట్ల దూరంలో ఆగిపోయింది. ప్రస్తుతం లోక్‌సభలో 540 మంది పూర్తిస్థాయిలో హాజరైతే సుమారు 360 ఓట్లు అవసరమవుతాయి. కొందరు ఎంపీలు గైర్హాజరైతే ఈ మార్క్ కొంత తగ్గే అవకాశం ఉంది. కేంద్ర వర్గాల అంచనా ప్రకారం ప్రస్తుతం ఎన్డీయేకు 319 మంది ఎంపీల మద్దతు ఉంది. ఇందులో బీజేపీ (241), టీఎంసీ నుంచి బయటకు వచ్చి నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎన్‌సీపీఐ)లో చేరిన 20 మంది ఎంపీలతో పాటు శిరోమణి అకాలీదళ్ ఎంపీ ఉన్నారు. శరద్ పవార్ ఎన్‌సీపీ (8), డీఎంకే (22) అండగా నిలిస్తే ఆ సంఖ్య 350కి చేరుతుంది. అయినా 360 మార్కు కోసం మిగిలిన పది ఓట్ల సమీకరణపై కేంద్రం ప్రత్యేక దృష్టి సారించింది.

టీఎంసీ తిరుగుబాటు ఎంపీల ఓట్లపై చర్చ

బిల్లు ఆమోదంలో టీఎంసీకి చెందిన 20 మంది తిరుగుబాటు ఎంపీల ఓట్లు అత్యంత కీలకంగా మారాయి. లోక్‌సభలోని 28 మంది టీఎంసీ ఎంపీల్లో 20 మంది జూన్‌లో ఎన్‌సీపీఐలో విలీనమవుతున్నట్లు ప్రకటించి ఎన్డీయేకు మద్దతిచ్చారు. పార్టీ ఫిరాయింపుల చట్టం కింద వీరిపై అనర్హత వేటు వేయాలని టీఎంసీ నేత అభిషేక్ బెనర్జీ స్పీకర్ ఓం బిర్లాకు ఫిర్యాదు చేసి ఆరు నెలలైనా నిర్ణయం వెలువడలేదు. స్పీకర్ అధికారికంగా అనర్హులుగా ప్రకటించేంత వరకు వారికి ఓటు హక్కు ఉంటుందని లోక్‌సభ సచివాలయ వర్గాలు పేర్కొన్నాయి. దీనిపై టీఎంసీ రాజ్యసభ సభ్యురాలు సాగరికా ఘోష్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ, ఆ 20 మంది వేసే ఓట్లను చట్టబద్ధంగా పరిగణించవచ్చా అని ప్రశ్నించారు.

డీఎంకే షరతులు.. స్టాలిన్ స్పష్టత

కాంగ్రెస్‌తో విభేదించి ఇండియా కూటమి నుంచి వైదొలిగిన డీఎంకే వైఖరి కీలకంగా మారింది. అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచేలా కేంద్రం బిల్లు సవరించిందన్న ప్రచారంతో డీఎంకే మద్దతివ్వొచ్చన్న ఊహాగానాలు జోరందుకున్నాయి. అయితే మద్దతు కోసం ఆ పార్టీ రెండు షరతులు విధించింది. 50 శాతం సమాన పెంపుతో పార్లమెంటులో తమిళనాడుకున్న 7.18 శాతం వాటా (ప్రస్తుతం 39 సీట్లు, పెంపుతో 59 అవుతాయి) తగ్గకూడదని, 1971 జనాభా లెక్కల ప్రకారం ఉన్న ప్రాతినిధ్య నిష్పత్తిని మరో 25 ఏళ్లు యథాతథంగా కొనసాగించాలని డిమాండ్ చేస్తోంది. వీటిపై నోటిమాట హామీ కాకుండా బిల్లు ముసాయిదాలోనే చేర్చాలని పట్టుబడుతోంది. మరోవైపు రాష్ట్ర ప్రయోజనాల విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ప్రధాన డిమాండ్ల నుంచి వెనక్కి తగ్గబోమని డీఎంకే అధినేత స్టాలిన్ శుక్రవారం స్పష్టం చేశారు. మీడియా ఊహాగానాలు, వెన్నుపోటుదారుల విమర్శలు తమ సంకల్పాన్ని కదిలించలేవని, పదవుల కోసం సిద్ధాంతాలను తాకట్టు పెట్టిన వారిపై పరోక్షంగా మండిపడ్డారు. 50 శాతం సమాన పెంపు ఫార్ములా ప్రతిపాదించినా, సీట్ల సంఖ్య పరంగా ఉత్తరాది, దక్షిణాది రాష్ట్రాల మధ్య అంతరం పెరుగుతుందన్న ఆందోళన రాజకీయ వర్గాల్లో ఇంకా కొనసాగుతోంది.

శరద్ పవార్ పార్టీలో భిన్న స్వరాలు

ఎనిమిది మంది ఎంపీలు ఉన్న ఎన్‌సీపీ (శరద్ పవార్ వర్గం) నుంచి శుక్రవారం భిన్న సంకేతాలు వెలువడ్డాయి. శరద్ పవార్‌తో భేటీ అనంతరం ఎమ్మెల్యే జితేంద్ర అవ్హాడ్ మాట్లాడుతూ.. డీలిమిటేషన్ రాజ్యాంగపరమైన అవసరమని పవార్ భావిస్తున్నారని, బిల్లుకు తమ పార్టీ మద్దతిస్తుందని ప్రకటించారు. అయితే ఎంపీ సుప్రియా సూలే దీనికి భిన్నంగా స్పందించారు. బిల్లు ముసాయిదా పరిశీలించాకే అధికారిక వైఖరి వెల్లడిస్తామని, గుడ్డిగా వ్యతిరేకించడం లేదా సమర్థించడం సరికాదని అన్నారు. డీహైడ్రేషన్‌తో పవార్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నందున శనివారం ఢిల్లీలో జరిగే ఇండియా కూటమి భేటీకి తన స్థానంలో ఎంపీ నీలేశ్ లంకే హాజరవుతారని ఆమె తెలిపారు. ప్రత్యేక సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆ పార్టీ ఎంపీలకు విప్ జారీ చేసింది.

విపక్షాల వ్యూహంపై సర్వత్రా ఆసక్తి

ప్రత్యేక సమావేశాలకు ముందు అధికార, విపక్ష శిబిరాల్లో సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. రాష్ట్రాల సీట్ల వాటాకు భంగం కలగని సవరణలతో విస్తృత మద్దతు కూడగట్టాలని కేంద్రం ప్రయత్నిస్తుండగా, శనివారం భేటీ అవుతున్న ఇండియా కూటమి రచించే ఉమ్మడి వ్యూహంపై ఆసక్తి నెలకొంది. డీఎంకే, ఎన్‌సీపీ తుది నిర్ణయాలు, టీఎంసీ తిరుగుబాటు ఎంపీల ఓట్లు, మిగిలిన పది ఓట్ల సమీకరణమే 'మిషన్ 360' భవితవ్యాన్ని తేల్చనున్నాయి.

మహిళా, డీలిమిటేషన్ బిల్లులకు కేబినెట్ ఓకే

- చట్టసభల్లో 33 శాతం మహిళా కోటా, 50 శాతం సీట్ల పెంపు
- ఏ రాష్ట్రం వాటా తగ్గకుండా బిల్లులో కీలక సవరణలు
- ఈ నెల 30 నుంచి జరిగే ప్రత్యేక సమావేశాల్లో ప్రవేశం
- 'మిషన్ 360'పై ఎన్డీయే గురి.. శనివారం ఇండి కూటమి భేటీ



న్యూఢిల్లీ, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): నియోజకవర్గాల పునర్విభజనతో ముడిపడిన మహిళా రిజర్వేషన్ బిల్లుకు కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన 'సేవా తీర్థ్'లో శుక్రవారం జరిగిన ప్రత్యేక భేటీలో కేబినెట్ ఈ కీలక నిర్ణయం తీసుకుంది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుతో పాటు జనాభా ప్రాతిపదికన నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఈ నెల 30 నుంచి డిసెంబర్ 3 వరకు జరిగే పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో వీటిని ప్రవేశపెట్టేందుకు కేంద్రం రంగం సిద్ధం చేసింది. పునర్విభజన తర్వాత ఏ రాష్ట్రమూ తన లోక్‌సభ సీట్ల నిష్పత్తిని కోల్పోకుండా బిల్లులో కేంద్రం కీలక సవరణలు చేసినట్లు సమాచారం. అన్ని రాష్ట్రాల్లోనూ సమానంగా 50 శాతం మేర సీట్లు పెరిగేలా, జనగణనతో సంబంధం లేకుండానే పునర్విభజన ప్రక్రియ చేపట్టేలా విధివిధానాల్లో మార్పులు చేసింది. ఈ బిల్లు ద్వారా ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలను 850 వరకు పెంచాలని ప్రతిపాదిస్తోంది.

'మిషన్ 360'.. సంఖ్యాబలంపై ఎన్డీయే కసరత్తు

ఈ ఏడాది ఏప్రిల్‌లో డీలిమిటేషన్‌తో కూడిన మహిళా రిజర్వేషన్ బిల్లును కేంద్రం ప్రవేశపెట్టగా, తగిన సంఖ్యాబలం లేక వీగిపోయింది. ఈసారి ఎలాగైనా ఆమోదింపజేసుకోవాలని పట్టుదలగా ఉన్న మోదీ సర్కారు 'మిషన్ 360' లక్ష్యంతో పావులు కదుపుతోంది. రాజ్యాంగ సవరణ బిల్లు కావడంతో సభకు హాజరైన సభ్యుల్లో మూడింట రెండొంతుల మెజారిటీ తప్పనిసరి. లోక్‌సభలోని మొత్తం 543 స్థానాల్లో మూడు ఖాళీగా ఉన్నాయి. స్పీకర్ మినహా 539 మంది హాజరైతే బిల్లు గట్టెక్కడానికి 360 మంది మద్దతు అవసరం. బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయేకు గతంలో 293 మంది ఎంపీలు ఉండగా, ఇటీవల టీఎంసీ నుంచి చీలిన 20 మంది ఎంపీలు నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో చేరి ఎన్డీయేకు మద్దతు ప్రకటించారు. శివసేనఉయూబీటీకి చెందిన ఆరుగురు ఎంపీలు ఏక్‌నాథ్ శిందే వర్గంలో చేరడంతో ఎన్డీయే బలం 319కి పెరిగింది. అంటే మరో 41 మంది ఎంపీల మద్దతు అవసరం.

మారుతున్న వైఖరి.. కలిసొచ్చే సమీకరణాలు

అన్ని రాష్ట్రాల్లో సమానంగా 50 శాతం సీట్లు పెంచే నిబంధనపై కేంద్రం సంకేతాలివ్వడంతో గతంలో బిల్లును వ్యతిరేకించిన డీఎంకే, ఎన్‌సీపీఉఎస్పీ పార్టీలు సానుకూలంగా స్పందిస్తున్నాయి. 50 శాతం పెంపుపై లిఖితపూర్వక హామీ ఉంటే మద్దతుకు అభ్యంతరం లేదని ఎన్‌సీపీఉ ఎస్పీ నేత సుప్రియా సూలే స్పష్టం చేయగా, తమిళనాడుకు ప్రస్తుతం ఉన్న 7.2 శాతం వాటాను కొనసాగిస్తే మద్దతిస్తామని డీఎంకే చెబుతోంది. ఈ రెండు పార్టీలకు కలిపి 30 మంది ఎంపీలు ఉన్నారు. వీరితో పాటు బీఆర్ఎస్, వైసీపీ (నలుగురు ఎంపీలు), యూపీపీఎల్ (ఒక ఎంపీ) మద్దతు తోడైతే ఎన్డీయే బలం 354 దాటుతుంది. దీనికి తోడు సభలో హాజరు సమీకరణాలు కూడా కేంద్రానికి కలిసొస్తున్నాయి. టీఎంసీ ఎంపీ కళ్యాణ్ బెనర్జీ సస్పెన్షన్‌లో ఉండగా, ఎంపీలు అమృత్‌పాల్ సింగ్, షేక్ రషీద్ జైలులో ఉన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఎంపీ ఆగా రుహుల్లా రాజీనామా చేశారు. వీరు నలుగురూ ఓటింగ్‌లో పాల్గొనలేరు. ఎంఐఎం, ఏఎస్పీ, జెడ్పీఎం పార్టీల ముగ్గురు ఎంపీలు, ముగ్గురు స్వతంత్రుల్లో కొందరు గైర్హాజరైనా మెజారిటీ మార్క్ మరింత తగ్గి బిల్లు సులువుగా గట్టెక్కే అవకాశం ఉంది. ఉభయ సభల్లో తమకు సరిపడా సంఖ్యాబలం ఉందని బీజేపీ ధీమా వ్యక్తం చేస్తోంది.

శనివారం ఇండి కూటమి వ్యూహరచన

మరోవైపు విపక్ష ఇండి కూటమి ఈ బిల్లును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. పార్లమెంటులో బిల్లును అడ్డుకునేందుకు ఉమ్మడి వ్యూహం రచించేందుకు కూటమి నేతలు శనివారం సమావేశం కానున్నారు. ఈ బిల్లులు మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తాయని ప్రభుత్వ వర్గాలు పేర్కొంటుండగా, నియోజకవర్గాల పునర్విభజనపై వివిధ రాష్ట్రాలు, విపక్షాల స్పందనపై ఉత్కంఠ నెలకొంది.

డీలిమిటేషన్‌పై నేడు విపక్షాల భేటీ

- ఉదయం 11.30కి ఇండి కూటమి వ్యూహరచన
- ఎంపీలకు విప్ జారీ చేసిన కాంగ్రెస్
- రాజ్యాంగంపై దాడిగా అభివర్ణించిన జైరాం రమేశ్
- రాష్ట్ర ప్రయోజనాల్లో రాజీ లేదన్న స్టాలిన్



న్యూఢిల్లీ, నవంబర్ 27 (ఉద్యమ కెరటం) : పార్లమెంటు ప్రత్యేక సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న డీలిమిటేషన్ బిల్లును ఎదుర్కొనేందుకు విపక్ష ఇండి కూటమి అప్రమత్తమైంది. సభలో అనుసరించాల్సిన ఉమ్మడి వ్యూహం, తదుపరి కార్యాచరణపై చర్చించేందుకు ఇండి కూటమి, ఇతర విపక్ష పార్టీలు శనివారం ఉదయం 11.30 గంటలకు సమావేశం కానున్నాయని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా నేతృత్వంలోని కేంద్రం దేశ ప్రజలకు పెద్ద ఉచ్చు పన్నేందుకు ప్రయత్నిస్తోందని ఆయన ఆరోపించారు. డీఎంకే రాజ్యాంగానికి కట్టుబడి ఉంటుందన్న ఆయన, ఈ భేటీ కోసం అన్ని ప్రతిపక్ష పార్టీలను సంప్రదిస్తున్నామని వెల్లడించారు. మరోవైపు, ప్రత్యేక సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలని కాంగ్రెస్ పార్టీ తన లోక్‌సభ, రాజ్యసభ ఎంపీలకు విప్ జారీ చేసింది. నవంబర్ 29 నాటికి అందరూ ఢిల్లీకి చేరుకోవాలని ఆదేశించింది.

రాజ్యాంగంపై దాడి: జైరాం రమేశ్

లోక్‌సభలో మూడింట రెండొంతుల మెజారిటీ సాధించేందుకు కేంద్రం చేస్తున్న ప్రయత్నాన్ని రాజ్యాంగంపై జరిగిన దాడిగా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అభివర్ణించారు. తయారీ పరిశ్రమను పునరుద్ధరించడంలో విఫలమైన మోదీ ప్రభుత్వం ఆందోళనతో చేస్తున్న నిస్సహాయ చర్యగా ఈ ప్రత్యేక సెషన్‌ను పేర్కొన్నారు. మోదీఉషా జోడీ మరోసారి అబద్ధాలు చెబుతోందని ఆయన ఆరోపించారు. 2023 సెప్టెంబర్‌లోనే పార్లమెంటు ఏకగ్రీవంగా ఆమోదించిన 'నారీ శక్తి వందన్ అధినియమ్'ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశం మహిళా రిజర్వేషన్ కోసం కాదని, బీజేపీకి ప్రయోజనం చేకూర్చేలా నియోజకవర్గాల పునర్విభజన కోసమేనని విమర్శించారు. మరో 25 ఏళ్ల పాటు లోక్‌సభ ఎంపీల సంఖ్యను ఇలాగే కొనసాగిస్తూ, 2029 ఎన్నికల నుంచే మహిళలకు మూడో వంతు కోటా కల్పించాలన్నదే కాంగ్రెస్ స్పష్టమైన వైఖరని స్పష్టం చేశారు.

మద్దతిచ్చేవారు దేశద్రోహులే: సంజయ్ రౌత్

ప్రతిపాదిత డీలిమిటేషన్ బిల్లు దేశ, ప్రజాస్వామ్య వ్యతిరేకమైనదని శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్ మండిపడ్డారు. 2029 లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి తప్పదని భావించిన ప్రభుత్వం లోక్‌సభ సభ్యుల సంఖ్యను 860కి పెంచి పునర్విభజన చేపట్టాలని యోచిస్తోందని ఆయన ఆరోపించారు. ఈ బిల్లుకు అనుకూలంగా ఓటేసేవారు చరిత్రలో దేశద్రోహులుగా మిగిలిపోతారని వ్యాఖ్యానించారు.

రాష్ట్ర ప్రయోజనాల్లో రాజీ లేదు: స్టాలిన్

లోక్‌సభలో తమిళనాడుకు ఉన్న ప్రాతినిధ్య వాటాను కాపాడాలని, రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఎటువంటి రాజీకి తావులేదని డీఎంకే అధినేత, తమిళనాడు మాజీ సీఎం ఎం.కె. స్టాలిన్ స్పష్టం చేశారు. పునర్విభజన వల్ల కలిగే ప్రమాదాలపై తొలుత గళమెత్తింది డీఎంకేనే అని, సరైన పద్ధతిలో ప్రక్రియ జరగాలని దేశవ్యాప్త నేతలు చెన్నైలోనే ఏకమై డిమాండ్ చేశారని గుర్తుచేశారు. డీలిమిటేషన్ బిల్లుకు మద్దతిచ్చి డీఎంకే చారిత్రక తప్పిదం చేయదని వీసీకే అధినేత తిరుమావళవన్ విశ్వాసం వ్యక్తం చేశారు. పార్లమెంటులో బిల్లును ఓడించేందుకు టీవీకే, కాంగ్రెస్, ఇతర ఇండి కూటమి భాగస్వామ్య పక్షాలు ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు.

సీపీఐ వ్యతిరేకత.. భేటీకి సుప్రియ దూరం

మహిళా రిజర్వేషన్లను డీలిమిటేషన్‌తో ముడిపెట్టడం ఆమోదయోగ్యం కాదని, ప్రతిపాదిత బిల్లును తాము వ్యతిరేకిస్తామని సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ స్పష్టం చేశారు. మహిళా కోటాకు తాము మద్దతిచ్చామని, వైఖరిలో మార్పు చేసుకున్న పార్టీలు వివరణ ఇవ్వాలని కోరారు. మరోవైపు, డీలిమిటేషన్ బిల్లు ముసాయిదాను గానీ, ప్రత్యేక సమావేశాల ఎజెండాను గానీ ప్రభుత్వం ఇంకా వెల్లడించలేదని ఎన్‌సీపీ (ఎస్పీ) ఎంపీ సుప్రియా సూలే అన్నారు. తన తండ్రి శరద్ పవార్ ఆసుపత్రిలో ఉన్నందున శనివారం జరిగే ఇండి కూటమి సమావేశానికి తాను హాజరుకాలేకపోతున్నానని తెలిపారు

కొలీజియంలో ఒకే వర్గానికి పెద్దపీట!

జోక్యం కోరుతూ రాష్ట్రపతి ముర్ముకు మాజీ సీజేఐ గవాయ్ లేఖ

న్యూఢిల్లీ, నవంబర్ 27 (ఉద్యమ కెరటం) : ఉన్నత న్యాయస్థానాల్లో న్యాయమూర్తుల నియామకాలకు సిఫార్సులు చేసే కొలీజియం వ్యవస్థ ప్రతిభ, సర్వసమావేశకత (ఇన్‌క్లూసివ్‌నెస్) సూత్రాలను పూర్తిగా విస్మరిస్తోందని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ ఆరోపించారు. ఇతరులను పక్కనపెట్టి సమాజంలోని ఒక ప్రత్యేక వర్గానికే సిఫార్సుల్లో ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొంటూ ఆయన శుక్రవారం రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు లేఖ రాశారు. ఇటీవలి నియామకాలు, బదిలీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఆయన.. హైకోర్టులు, సుప్రీంకోర్టులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీల తక్కువ ప్రాతినిధ్యంపై జోక్యం చేసుకోవాలని కోరారు. తాను కొలీజియం సభ్యుడిగా, సీజేఐగా ఉన్నప్పుడు వైవిధ్య సూత్రాలను పాటించానని తెలిపారు.గత 75 ఏళ్లుగా సుప్రీంకోర్టు స్వరూపంలో పెద్దగా మార్పు రాలేదని, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలు, మహిళలతో పాటు ఇతర అగ్రవర్ణాలనూ పక్కనపెట్టి ఒకే వర్గం పట్టు సాధించిందని జస్టిస్ గవాయ్ పేర్కొన్నారు. 2018 నుంచి నియమితులైన 715 మంది హైకోర్టు న్యాయమూర్తుల్లో కేవలం 22 మంది ఎస్సీలు, 16 మంది ఎస్టీలు, 89 మంది ఓబీసీలు, 37 మంది మైనారిటీలు మాత్రమే ఉన్నారని గణాంకాలతో వివరించారు. 2021ఉ2026 మధ్య నియామకాల్లో అగ్రవర్ణాల వాటా దాదాపు 80 శాతంగా ఉండగా, జనాభాలో 40ఉ50 శాతం ఉన్న ఓబీసీలకు 14 శాతానికి లోపే వాటా దక్కిందన్నారు. దేశ జనాభాలో 5 శాతానికి లోపు ఉన్న ఒక వర్గానికి సుప్రీంకోర్టులో 40 శాతానికి పైగా ప్రాతినిధ్యం ఉందని, ఇది ఇటీవల మరింత పెరిగిందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

బెంగాల్ ప్రతిపక్ష నేత నియామకం రద్దు

10 రోజుల్లో తాజా ఉత్తర్వులివ్వాలని స్పీకర్‌కు ఆదేశం

కోల్‌కతా, నవంబర్ 27 (ఉద్యమ కెరటం) : పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ప్రతిపక్ష నేతగా టీఎంసీ రెబల్ నేత రితబ్రత బెనర్జీ, చీఫ్ విప్‌గా ఎమ్మెల్యే అఖ్ఖుజ్జమాన్ నియామకాలను కలకత్తా హైకోర్టు శుక్రవారం రద్దు చేసింది. అసెంబ్లీ స్పీకర్ రథీంద్ర బోస్ తీసుకున్న నిర్ణయం చట్టబద్ధంగా సమర్థనీయం కాదని స్పష్టం చేసిన జస్టిస్ కృష్ణారావు ఏకసభ్య ధర్మాసనం.. ఈ అంశాన్ని పునఃపరిశీలించి, 10 రోజుల్లోగా సహేతుక కారణాలతో తాజా ఉత్తర్వులు జారీ చేయాలని స్పీకర్‌ను ఆదేశించింది. దీంతో మమతా బెనర్జీ వర్గానికి భారీ ఊరట లభించింది. మే నెలలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ చేతిలో ఓటమితో మమత 15 ఏళ్ల పాలనకు తెరపడగా, ఆ తర్వాత టీఎంసీలో భారీ చీలిక ఏర్పడింది. మే 6న 70 మంది ఎమ్మెల్యేలు సీనియర్ నేత శోభన్‌దేవ్ చటోపాధ్యాయను ప్రతిపక్ష నేతగా ఎన్నుకోగా, సంతకాలు ఫోర్జరీ చేశారంటూ రితబ్రత స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం 59 మంది ఎమ్మెల్యేలతో 'డెమోక్రటిక్ తృణమూల్ కాంగ్రెస్' పేరిట వేరుపడిన రితబ్రతను జూన్ 3న స్పీకర్ ప్రతిపక్ష నేతగా గుర్తించారు. దీనిని సవాల్ చేస్తూ శోభన్‌దేవ్ కోర్టును ఆశ్రయించారు. జులైలో డివిజన్ బెంచ్ ఇచ్చిన రెండు నెలల మధ్యంతర గడువు అక్టోబర్ 18న ముగిసినా, వారు ప్రభుత్వ సౌకర్యాలు అనుభవిస్తున్నారని ఆయన మరోసారి కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. విచారణ అనంతరం హైకోర్టు రెబల్ నేతల నియామకాలను కొట్టివేసింది. మరోవైపు టీఎంసీ పేరు, ఎన్నికల గుర్తుపై మమత, రితబ్రత వర్గాల మధ్య నెలకొన్న వివాదంపై కేంద్ర ఎన్నికల సంఘం శుక్రవారం తొలి విచారణ చేపట్టింది.



మరుగుదొడ్డి, తాగునీటి సౌకర్యాలు కల్పించాలి

ఉద్యమ కెరటం, దహేగాం: దహేగాం తహశీల్దార్ కార్యాలయానికి నిత్యం వివిధ పనుల నిమిత్తం వందలాది మంది ప్రజలు వస్తుంటారని, కార్యాలయం వద్ద కనీస మౌలిక సదుపాయాలైన మరుగుదొడ్డి, తాగునీటి వసతి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని మండల ప్రజలు పేర్కొంటున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకొని తహశీల్దార్ కార్యాలయం సమీపంలో మరుగుదొడ్డి నిర్మించడంతో పాటు, వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని వాటర్ ఫ్రిజ్ ఏర్పాటు చేసి చల్లని తాగునీటి సౌకర్యం కల్పించాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి తహశీల్దార్, ఎంపీడీఓతో పాటు అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో ముందుకు రావాలని సర్పంచ్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామపంచాయతీ సిబ్బంది విజ్ఞప్తి చేశారు. అవసరమైన నిధులు మంజూరు చేయించి ప్రజలకు త్వరితగతిన ఈ మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.

తాండూర్ సొసైటీలో రైతు సభ్యత్వాల నమోదు ప్రారంభం



ఉద్యమ కెరటం, తాండూర్: తాండూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో రైతుల సభ్యత్వ నమోదు ప్రక్రియ ప్రారంభమైనట్లు సంఘం కార్యదర్శి అనిల్ శుక్రవారం తెలిపారు. తాండూర్ మండలానికి చెందిన పది గుంటలు, అంతకంటే ఎక్కువ పట్టా వ్యవసాయ భూమి కలిగిన రైతులు సభ్యత్వం పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. సహకార సంఘంలో సభ్యత్వం పొందడం ద్వారా రైతులకు సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, పంట రుణాలు వంటి ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. త్వరలో పీఏసీఎస్‌లో ఎన్నికలు జరిగే అవకాశం ఉందని, రైతులు సభ్యత్వాలు నమోదు చేసుకొని ఓటు హక్కు పొందాలని సూచించారు. సభ్యత్వానికి ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్‌బుక్ జిరాక్స్ తో పాటు రెండు ఫొటోలు, రూ.2,500 డిపాజిట్ అవసరం ఉంటుందన్నారు. మండలంలోని పట్టా భూములు కలిగిన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సహకార సంఘంలో సభ్యత్వం పొందాలని ఆయన కోరారు.

రూ.5లక్షల బీమాతో పేద కుటుంబాలకు భరోసా



ఉద్యమ కెరటం, మద్దూర్: మండలంలో మేనూర్ గ్రామంలో సర్పంచ్ అశోక్ పటేల్ శుక్రవారం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు బీమా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఎండీ.ముజీబ్ మాట్లాడుతూ కుటుంబాన్ని పోషించే వ్యక్తికి అనుకోని ప్రమాదం జరిగి మరణిస్తే, ఆ కుటుంబానికి రూ.5లక్షల బీమా పరిహారం అందించడం ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన కుటుంబంలోని ఒక సంపాదించే వ్యక్తికి ఈ పథకం వర్తిస్తుందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరస్వర్ సాయిలు, ఎంపీడీఓ సాయిలు, ఎంపీఓ సత్యనారాయణ, కొండా గంగాధర్, సంతోష్ పటేల్, గ్రామ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది జూబ్రే సురేష్, భీంరావ్ పటేల్, గ్రామస్తులు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు వరం

కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ



ఉద్యమ కెరటం, సిద్దిపేట: ఇల్లు లేని నిరుపేద కుటుంబాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుందని, ఇందిరమ్మ ఇండ్ల పథకం పేదల సొంతింటి కలను సాకారం చేసే లక్ష్యంతో అమలు చేస్తున్నట్లు సిద్దిపేట నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ అన్నారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పథకం లబ్ధిదారులైన నల్ల హరిత, నల్ల పరశురాములు నూతన గృహ నిర్మాణాలకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులైన ప్రతి నిరుపేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఇల్లు లేని పేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ పూజల గోపికృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ సాధుల పవన్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బొమ్మల యాదగిరి, కాలీముద్దీన్ అహ్మద్, గ్రామ నాయకులు శ్రవణ్, వార్డు సభ్యులు రాములు, నర్సింలు, దుద్దెడ కనకయ్య, గోపి, నక్క యాదగిరి, ఆత్మ కమిటీ సభ్యులు అజ్మత్, జనార్దన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ టౌన్: 2026 సంవత్సరం ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలుకు అవసరమైన చోట కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ హర్ష చౌదరి లతో కలిసి జిల్లా పౌరసరఫరాలు, సహకార, వ్యవసాయ, రవాణా, పోలీస్ శాఖల అధికారులు, ఐ.కె.పి. అధికారులు, రైస్ మిల్లర్లతో ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలుపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ వరి ధాన్యం కొనుగోలు కొరకు అవసరమైన చోట ఐ.కె.పి., ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, ప్రతి కొనుగోలు కేంద్రం వద్ద మద్దతు ధర ఫ్లెక్సీలు, త్రాగునీరు, విద్యుత్ సౌకర్యం, నీడ ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో గోనె సంచులు, టార్పాలిన్ కవర్లు, ప్యాడి క్లీనర్లు, డ్రయ్యర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే కేటాయించిన ప్రకారం మిల్లులకు తరలించాలని, రైస్ మిల్లర్లు ధాన్యాన్ని దిగుమతి చేసుకోవడంలో జాప్యం చేయకూడదని తెలిపారు. రైస్ మిల్లర్లు అగ్రిమెంట్లు, బ్యాంకు గ్యారంటీ వివరాలు త్వరగా సమర్పించాలని, గత రబీ సీజన్ సి.ఎం.ఆర్. బియ్యాన్ని త్వరగా అందించాలని తెలిపారు. అధికారులు సమన్వయంతో వ్యవహరించి ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోలు ప్రక్రియను విజయవంతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిత్ అలీ, జిల్లా మేనేజర్ రజిత, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటి, సంబంధిత శాఖల అధికారులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

పునరావాస కాలనీలలో మౌలిక వసతులు కల్పించాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత



ఉద్యమ కెరటం, కెరమేరి:
రాంజీగూడ గ్రామస్తులకు ధనోరా గ్రామం వద్ద ఏర్పాటు చేయనున్న పునరావాస కాలనీలో మౌలిక వసతుల కల్పనకు ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కెరమెరి మండలం ధనోరా గ్రామ శివారులో ఏర్పాటుచేసిన పునరావాస ప్రదేశాన్ని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం. డేవిడ్, ఇతర అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కొమరం భీమ్ ప్రాజెక్టు నిర్మాణంలో బ్యాక్ వాటర్ ముంపు గ్రామమైన రాంజీగూడా గ్రామస్తులకు ధనోరా గ్రామం వద్ద పునరావాసం కల్పించడం జరిగిందని, గ్రామస్తులను పునరావాస కాలనీకి తరలించేందుకు కాలనీలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. చెట్ల పొదలు చదును చేసి ప్లాట్లు చేయాలని, సి.సి. రహదారులు, మురుగు కాలువలు, విద్యుత్ లైన్, మిషన్ భగీరథ త్రాగునీరు అందించేందుకు ట్యాంకు నిర్మాణం వంటి అభివృద్ధి పనులు చేపట్టాలని తెలిపారు. పనులను చేపట్టి నిర్ణీత గడువులోగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్.ఈ. ఉత్తం జాడే, సర్వే ల్యాండ్ రికార్డ్స్ ఎ.డి. వినయ్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్:
కుమ్రంభీమ్ ఆసిఫాబాద్ జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సముదాయంలో గల పాలనాధికారి చాంబర్ లో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సొసైటీ ప్రతినిధులతో కలిసి గోడ ప్రతులను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నషా ముక్త్ భారత్ అభియాన్ లో భాగంగా జిల్లాను మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని తెలిపారు. మత్తు పదార్థాలకు అలవాటు పడినవారు ఆరోగ్యంగా, ఆర్థికంగా క్షీణించి వారి కుటుంబాలు రోడ్డున పడే అవకాశం ఉందని, యువత మత్తు బారిన పడకుండా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గ్రామాలలో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. మత్తు పదార్థాలు, మద్యం, పొగాకు వంటి వాటికీ యువత దూరంగా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు పాల్గొన్నారు

అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయమ్మల కొరత

- **వంట నుంచి చిన్నారుల సంరక్షణ వరకు టీచర్లపై పనిభారం**
- **తక్షణమే ఖాళీలను భర్తీ చేయాలనే డిమాండ్**

ఉద్యమ కెరటం, సిద్దిపేట: చిన్నారులకు పౌష్టికాహారం అందిస్తూ, పూర్వ ప్రాథమిక విద్యాబోధన చేయాల్సిన అంగన్‌వాడీ కేంద్రాలు సిబ్బంది కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. సిద్దిపేట జిల్లా వ్యాప్తంగా పలు కేంద్రాల్లో ఆయమ్మ పోస్టులు ఖాళీగా ఉండటంతో వాటి నిర్వహణ బాధ్యతలు అంగన్‌వాడీ టీచర్లపైనే పడుతున్నాయి. దీంతో బోధనతో పాటు వంట, శుభ్రత, చిన్నారుల సంరక్షణ వంటి పనులన్నీ వారే చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి అంగన్‌వాడీ కేంద్రంలో ఒక టీచర్‌తో పాటు ఒక ఆయమ్మ ఉండాలి. పిల్లలను కేంద్రానికి తీసుకురావడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం, చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం వండి పెట్టడం ఆయమ్మల ప్రధాన విధులు. అయితే ఖాళీలు భర్తీ కాకపోవడంతో ఈ బాధ్యతలను కూడా టీచర్లే నిర్వహిస్తున్నారు. ఒకవైపు చిన్నారులకు విద్యాబోధన, మరోవైపు ప్రభుత్వ రికార్డుల నిర్వహణ, ఆన్‌లైన్ యాప్‌లలో వివరాల నమోదు, వంట పనులతో టీచర్లు తీవ్ర పని ఒత్తిడికి గురవుతున్నారు. సిబ్బంది కొరత కారణంగా చిన్నారులపై పూర్తిస్థాయిలో పర్యవేక్షణ చేయడం కష్టంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పదవీ విరమణ, ఇతర కారణాలతో ఖాళీ అయిన ఆయమ్మ పోస్టులను భర్తీ చేయడంలో జాప్యం జరుగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ సమస్యపై సంబంధిత ఐసీడీఎస్ అధికారులు, జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ స్పందించి జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న ఆయమ్మ పోస్టులను గుర్తించి వెంటనే భర్తీ చేయాలని తల్లిదండ్రులు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. చిన్నారులకు మెరుగైన పోషకాహారం, నాణ్యమైన విద్య అందించాలంటే ప్రతి కేంద్రంలో సరిపడా సిబ్బందిని నియమించాలని కోరుతున్నారు.

ఇందిరమ్మ బీమా నమోదు సకాలంలో పూర్తి చేయాలి



ఉద్యమ కెరటం, తిర్యాణి: అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ద్వారా ప్రయోజనం అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపీడీఓ నాగేష్ సూచించారు. మండలంలోని కన్నెపల్లి గ్రామపంచాయతీలో నిర్వహిస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను శుక్రవారం సర్పంచ్ తురం మాన్కుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తుల స్వీకరణ తీరు, లబ్ధిదారుల అర్హతలు, అవసరమైన ధ్రువపత్రాల పరిశీలనను ఎంపీడీఓ సమీక్షించారు. అర్హులైన కుటుంబాల వివరాలను జాగ్రత్తగా నమోదు చేయాలని, ఎలాంటి తప్పులు లేకుండా దరఖాస్తు ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సంబంధిత సిబ్బందికి సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అర్హులైన కుటుంబాలకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. గ్రామంలో అర్హత కలిగిన ఏ కుటుంబం కూడా ఈ పథకం ప్రయోజనానికి దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రజలకు పథకంపై పూర్తి అవగాహన కల్పించి, అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకునేలా ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ ప్రశాంత్, పంచాయతీ కార్యదర్శి మాధవి, తుంగల తిరుపతి, రాజకుమార్, శేఖర్, భీమేష్, మల్లయ్య, మురళి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూంపల్లిలో ఇందిరమ్మ బీమా నమోదు వేగవంతం



ఉద్యమ కెరటం, భూంపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియ సిద్దిపేట జిల్లా అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రంలోని భూంపల్లిలో వేగంగా కొనసాగుతోంది. అర్హులైన ప్రతి కుటుంబానికి రూ.5లక్షల ఉచిత జీవిత బీమా కల్పించాలనే లక్ష్యంతో గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్యదర్శి చింతల యాదగిరి మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 1,129 రేషన్ కార్డులు ఉండగా, ఇప్పటివరకు 533 కుటుంబాలకు సంబంధించిన వివరాలను క్షేత్రస్థాయిలో సేకరించినట్లు తెలిపారు. వీటిలో 450 దరఖాస్తులను ఇప్పటికే ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు వివరించారు. మిగిలిన కుటుంబాల వివరాలను కూడా త్వరలో సేకరించి నమోదు ప్రక్రియను పూర్తి చేస్తామని పేర్కొన్నారు. ఈ సర్వే కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు భస్వరాణి, భూలక్ష్మి పాల్గొని లబ్ధిదారుల వివరాలను సేకరిస్తున్నారు. 18 నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగి, కుటుంబ పోషణ బాధ్యతలు నిర్వహించే వ్యక్తి పేరిట ఈ బీమా వర్తిస్తుందని, బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే పూర్తిగా చెల్లిస్తుందని అధికారులు తెలిపారు. డిసెంబర్ 18వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ కొనసాగనున్న నేపథ్యంలో అర్హులైన కుటుంబాలు ఆధార్ కార్డు, రేషన్ కార్డు, మొబైల్ నంబర్, నామినీ వివరాలతో తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని కోరారు.

ధాన్యం కొనుగోలు ప్రక్రియ పకడ్బందీగా చేపట్టాలి





జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

ఉద్యమ కెరటం, మంచిర్యాల: జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించి, ప్రభుత్వ నిబంధనల ప్రకారం రైతుల నుంచి ధాన్యం సేకరించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం లక్షెట్టిపేట మండలం అంకతిపల్లిలో జై హనుమాన్ గ్రామ సంఘం, ఇటిక్యాలలో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను అదనపు కలెక్టర్ వి.రాములు, పౌరసరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ, తహశీల్దార్ దిలీప్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రాల్లో గన్నీ బ్యాగులు, తూకం యంత్రాలు, ఇతర సౌకర్యాలు అందుబాటులో ఉంచాలని సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని త్వరగా మిల్లులకు తరలించాలని తెలిపారు. గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461, సాధారణ రకానికి రూ.2,441 మద్దతు ధర చెల్లించనున్నట్లు, సన్నరకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ అందిస్తున్నట్లు వివరించారు. అనంతరం లింగాపూర్‌లోని శ్రీకృష్ణ ఇండస్ట్రీస్ రైస్ మిల్లును సందర్శించి ధాన్యం నిల్వలు, బియ్యం నాణ్యత, మిల్లింగ్ ప్రక్రియ, రికార్డులను పరిశీలించారు. దండేపల్లి, జన్నారం మండలాల్లోని పలు రైస్ మిల్లులను తనిఖీ చేశారు. అలాగే దండేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కర్ణపేట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించి విద్యాబోధన, పరిశుభ్రత, వసతి, భోజనం, తాగునీరు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఉపాధ్యాయులు, అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

మేనూర్ పల్లె ప్రకృతి వనం అధ్వానం

పట్టించుకోని అధికారులు

ఉద్యమ కెరటం, మద్నూర్: గ్రామీణ ప్రాంతాల్లో పచ్చదనాన్ని పెంపొందించడంతో పాటు ప్రజలకు ఆహ్లాద కరమైన వాతావరణాన్ని అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం మేనూర్ గ్రామంలో నిర్వహణ లోపంతో అధ్వానంగా మారుతోంది. ప్రజలకు ఆహ్లాదాన్ని అందించాల్సిన వనం ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతుండటంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గ్రామంలోని పల్లె ప్రకృతి వనంలో చెట్లు, మొక్కలు ఉన్నప్పటికీ వాటి సంరక్షణపై సరైన శ్రద్ధ చూపకపోవడంతో పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని గ్రామస్తులు పేర్కొంటున్నారు. వనం చుట్టూ పరిశుభ్రత పాటించడంతో పాటు మొక్కలకు నీరు అందించడం, కలుపు మొక్కలను తొలగించడం, పచ్చదనాన్ని కాపాడేందుకు అవసరమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం ప్రజారోగ్యం, ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనం నిర్వహణ లేక నిరుపయోగంగా మారడం పట్ల స్థానికులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, గ్రామ పంచాయతీ పాలకవర్గం వెంటనే స్పందించి వనాన్ని శుభ్రపర్చి, మొక్కలకు సరైన సంరక్షణ కల్పించి, ప్రజలకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలని కోరుతున్నారు. ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాలు కేవలం పేరుకే పరిమితం కాకుండా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బాల్య వివాహాల రహిత దేశంగా తీర్చిదిద్దాలి

జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య

ఉద్యమ కెరటం, మంచిర్యాల: బాల్య వివాహాల రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతిఒక్కరూ తమవంతు కృషి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య పిలుపునిచ్చారు. శుక్రవారం నస్పూర్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం ఆవరణలో డ్రీమ్ సొసైటీ ఆధ్వర్యంలో జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన బాల్య వివాహాల నిరోధక ప్రచార రథాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. బాల్య వివాహాలు నిర్వహించడం, వాటికి సహకరించడం చట్టరీత్యా నేరమని, బాల్య వివాహ నిరోధక చట్టం-2006 ప్రకారం రూ.లక్ష జరిమానా, రెండేళ్ల వరకు జైలు శిక్ష విధించే అవకాశం ఉందని తెలిపారు. బాల్య వివాహాలపై ప్రజల్లో అవగాహన కల్పిస్తున్న డ్రీమ్ సొసైటీ కృషిని అభినందించారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ బాల్య వివాహాల నిరోధానికి సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి చాతరాజుల దుర్గాప్రసాద్, కలెక్టరేట్ పరిపాలన అధికారి శ్రీనివాసరావు దేశ్‌పాండే, సంక్షేమ, కార్మిక, వైద్య ఆరోగ్య, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులు, పోషణ అభియాన్, చైల్డ్ హెల్ప్‌లైన్, బాలల పరిరక్షణ, మహిళా సాధికారత శాఖల ప్రతినిధులు, డ్రీమ్ సొసైటీ ప్రతినిధి సంతోష్, జిల్లా ప్రాజెక్టు మేనేజర్ వెంకటేశ్వర్లు, సమన్వయకర్తలు సుజాత, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆదివాసీ అస్థిత్వ పోరు గర్జన సభకు భారీగా తరలిరావాలి

ఉద్యమ కెరటం, కెరమెరి: 'జల్, జంగల్, జమీన్' నినాదంతో నిజాం పాలనను ఎదిరించిన ఆదివాసీ వీరుడు కొమురంభీం పోరాట గడ్డ జోడేఘాట్‌లో మరోసారి ఉద్యమ స్ఫూర్తి వెల్లివిరిసింది. డిసెంబర్ 9న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఆదివాసీ అస్థిత్వ పోరు గర్జన' బహిరంగ సభను విజయవంతం చేసేందుకు జోడేఘాట్ గ్రామ పటేల్ అధ్యక్షతన శుక్రవారం 'చలో హైదరాబాద్' సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జోడేఘాట్ గ్రామంలోని ప్రతి ఇంటి నుంచి ఆదివాసీలు భారీ సంఖ్యలో హైదరాబాద్ సభకు తరలివెళ్లాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. డాక్టర్ మైపతి అరుణ్ కుమార్ నాయకత్వంలో ఆదివాసీ హక్కులు, అస్తిత్వ పరిరక్షణ కోసం చేపడుతున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆదివాసీల హక్కుల సాధన కోసం లక్ష విల్లంబులతో సమరశంఖం పూరించేందుకు సిద్ధంగా ఉన్నామని నాయకులు, యువకులు స్పష్టం చేశారు. కొమురంభీం ఆశయ సాధన కోసం ఐక్యంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కొమురంభీం వర్ధంతి ఉత్సవ కమిటీ చైర్మన్, గ్రామాల యువజన సంఘం వ్యవస్థాపకులు పెందోర్ రాజేశ్వర్, గ్రామ పటేల్ దేవరీ, గ్రామ పెద్దలు, ఆదివాసీ యువకులు తదితరులు పాల్గొన్నారు.





ఉన్నత లక్ష్యాలతోనే ఉజ్వల భవిష్యత్తు

జిల్లా కలెక్టర్ రాజర్షి షా

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: యువత కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, ఆత్మవిశ్వాసం, సమయపాలనతో ఉన్నత వ్యక్తిత్వాన్ని నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శుక్రవారం ఆదిలాబాద్‌లోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ స్కూల్ లో 'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్' సంస్థ ఆధ్వర్యంలో 'యూత్ ట్రాన్స్‌ఫార్మేషన్ మిషన్'లో భాగంగా నిర్వహించిన వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో యువత ఉన్నత స్థాయికి ఎదగాలంటే కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, విశ్లేషణాత్మక ఆలోచనా శక్తిని పెంపొందించుకోవాలన్నారు. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాలో విలువైన సమయాన్ని వృథా చేయకుండా, చదువుతో పాటు తమలోని అంతర్గత నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. వ్యక్తిగత అభివృద్ధితో పాటు తల్లిదండ్రులు, గురువులను గౌరవిస్తూ సమాజానికి ఉపయోగపడే బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలని ఆకాంక్షించారు. 'మనసులను ప్రేరేపిస్తూ.. ఆత్మలను ప్రజ్వలింపజేద్దాం' అనే స్ఫూర్తితో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం యువతలో ఆత్మవిశ్వాసం, నూతన ఆలోచనలు, నాయకత్వ లక్షణాలను పెంపొందించేందుకు దోహదపడుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. నిర్వాహకులు, 'ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్' ప్రతినిధుల కృషిని కలెక్టర్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ లలిత కుమారి, లేబర్ ఆఫీసర్ ముత్యం రెడ్డి, రంజిత్ సుధాకర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.





ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

ఉద్యమ కెరటం, సత్తుపల్లి: రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా వెంటనే కొనుగోలు చేయాలని తెలంగాణ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం సంఘం ఆధ్వర్యంలో సత్తుపల్లి సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శులు రావుల రాజబాబు, కొలికపోగు సర్వేశ్వరరావు మాట్లాడుతూ ధాన్యం కోతలు ప్రారంభమైనా కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో ప్రారంభించక పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అకాల వర్షాలతో ధాన్యం తడిసి నాణ్యత దెబ్బతినే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాలకు తడిసి రంగు మారిన, మొలకెత్తిన ధాన్యాన్ని నిబంధనల పేరుతో తిరస్కరించకుండా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి గోనె సంచులు, తూకం యంత్రాలు, తేమ శాతం కొలిచే పరికరాలు, హమాలీ సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు చేసిన ధాన్యానికి రైతులకు సకాలంలో డబ్బులు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం నాయకులు మొరంపూడి వెంకట్రావు, చావా రమేష్, చప్పిడి భాస్కర్, కొవ్వాపు లక్ష్మణ్, సాధు శేఖర్ తదితర రైతులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇళ్లు, ఇంకుడు గుంతల నిర్మాణ పనులు వేగవంతం

పంచాయతీ కార్యదర్శి చింతల యాదగిరి

ఉద్యమ కెరటం, భూంపల్లి: భూంపల్లి గ్రామంలో ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి చింతల యాదగిరి తెలిపారు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. గ్రామానికి మొత్తం 70 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 60 ఇళ్ల నిర్మాణ పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని, మరో 10 ఇళ్లు ప్రారంభ దశలో ఉన్నాయని తెలిపారు. అదనంగా మరో 5 ఇళ్ల మంజూరు కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపినట్లు పేర్కొన్నారు. గ్రామంలో భూగర్భ జలాల పెంపు కోసం ఇంకుడుగుంతల నిర్మాణం చేపట్టామని, ఇప్పటికే మురుగునీటి నివారణ కోసం ఒక ఇంకుడుగుంత నిర్మాణం పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అలాగే 60 మరుగుదొడ్ల మంజూరు కోసం అధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకుల సహకారంతో గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నామని, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు.



15వ వార్డులో ఇందిరమ్మ బీమా పథకం ప్రారంభం

ఉద్యమ కెరటం, దుబ్బాక: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ బీమా పథకాన్ని శుక్రవారం దుబ్బాక మున్సిపల్ పరిధిలోని 15వ వార్డులో ప్రారంభించారు. దుబ్బాక పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రామచంద్ర రెడ్డి, వార్డులోని లబ్ధిదారులకు పథకం ప్రయోజనాలను వివరించారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు అందించడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



పదో తరగతి లో ప్రథమ ర్యాంకులు సాధించిన అక్కాచెల్లెళ్లకు ప్రోత్సాహకం

ఒక్కొక్కరికి రూ.10వేల నగదు బహుమతి అందజేత



ఉద్యమ కెరటం, హత్నూర: పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో ప్రథమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటిన అక్కాచెల్లెళ్లను శ్రీరామ్ చిట్‌ఫండ్స్ సంస్థ నగదు బహుమతులతో ప్రోత్సహించింది. సంగారెడ్డి జిల్లా హత్నూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుకున్న ఎండీ వసీం కుమార్తెలు ముస్కాన్, ఫాతిమా పదో తరగతి పరీక్షల్లో మండల స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించి అందరి ప్రశంసలు అందుకున్నారు. విద్యార్థినుల ప్రతిభను గుర్తించిన శ్రీరామ్ చిట్‌ఫండ్స్ సంస్థ ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున శుక్రవారం నగదు బహుమతి చెక్కులను అందజేసింది. గ్రామ సర్పంచ్ నల్లోల్ల ఎల్లయ్య, ఉప సర్పంచ్ చెక్కమానస రవీందర్ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థినులకు చెక్కులను అందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువులో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని పట్టుదలతో కృషి చేస్తే అనుకున్న గమ్యాన్ని చేరుకోవచ్చని అన్నారు. ముస్కాన్, ఫాతిమా ఇదే పట్టుదలతో ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయిలోనూ మంచి ఫలితాలు సాధించి గ్రామానికి మరింత గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, మాజీ ఉప సర్పంచ్ మేరాజ్, వార్డు సభ్యులు నల్లోల్ల నాగేష్, పండుగ శేఖర్, మన్నె యాదగిరి, బేగరి బాలు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ కెరటం
నిజం రక్షణే లక్ష్యం
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

‘పడిలేచిన న్యూజిలాండ్’

రెండో టెస్టులో ముగిసిన తొలిరోజు ఆట



క్రైస్ట్‌చర్చ్, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): క్రైస్ట్‌చర్చ్ వేదికగా భారత్, న్యూజిలాండ్ మధ్య రెండో టెస్టులో మొదటి రోజు ఆట ముగిసింది. తొలి రోజు పిచ్ బౌలర్లుకు, బ్యాటర్లకు ఇద్దరికీ సమానంగా సహకరించింది. టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 85 ఓవర్లలో 246-5 స్కోర్‌తో నిలిచింది. క్రీజులో టామ్ బ్లుండెల్ (53 పరుగులు), గ్లెన్ ఫిలిప్స్ (36 పరుగులు) ఉన్నారు. భారత బౌలర్లలో ఆకాశ్ దీప్ 2, అన్షుల్ కాంబోజ్, వాషింగ్టన్ సుందర్, గుర్నూర్ బ్రార్ తలో వికెట్ పడగొట్టారు. జస్ప్రీత్ బుమ్రాకు ఇవాళ ఒక్క వికెట్ కూడా దక్కలేదు. టాస్ నెగ్గిన టీమ్ఇండియా, కివీస్‌ను బ్యాటింగ్‌కు ఆహ్వానించింది. ఓపెనర్లు టామ్ లేథమ్ (59 పరుగులు), డేవన్ కాన్వే (31 పరుగులు) జట్టుకు మంచి ఆరంభమే ఇచ్చారు. ఈ ఇద్దరూ తొలి వికెట్‌కు 77 పరుగులు జోడించారు. కాన్వేను గుర్నూర్ ఔట్ చేశాడు. అయితే 110 పరుగుల వద్ద కివీస్ మూడు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్ లేథమ్‌ను 42వ ఓవర్లో ఆకాశ్ దీప్ వెనక్కిపంపగా, తర్వాతి ఓవర్లో హెన్రీ నికోల్స్ (16 పరుగులు)ను అన్షుల్ పెవిలియన్‌కు చేర్చాడు. 44వ ఓవర్ చివరి బంతికి రచిన్ రవీంద్ర (0) డకౌట్ అయ్యాడు. అతడిని ఆకాశ్ దీప్ ఔట్ చేశాడు. దీంతో కివీస్ 110 పరుగుకు నాలుగు కీలక వికెట్లు కోల్పోయింది. దీన్ని బౌలర్లు అవకాశంగా మల్చుకోవాలని ప్రయత్నించగా, డారిల్ మిచెల్ (31 పరుగులు), టామ్ బ్లుండెల్ క్రీజులో నిలదొక్కుకున్నారు. ఈ ఇద్దరూ ఐదో వికెట్‌కు 74 పరుగులు జోడించారు. అద్భుతమైన బంతితో మిచెల్‌ను సుందర్ ఔట్ చేయడంతో ఇవాళే ఆలౌట్ చేసే ఛాన్స్ ఉంటుందని అనిపించింది. కానీ ఈసారి ఫిలిప్స్ (36 పరుగులు) నిలబడిపోయాడు. అజేయంగా ఆరో వికెట్‌కు 62 పరుగులు జోడించారు. దీంతో 246 పరుగుల వద్ద ఇవాళ్టి ఆట ముగిసింది. పేసర్ సిరాజ్‌కు తొలి టెస్టు తుదిజట్టులో చోటు దక్కకపోవడం వివాదంగా మారిన నేపథ్యంలో రెండో మ్యాచ్‌లో జట్టు ఎలా ఉంటుందో అని ఆసక్తి నెలకొంది. మాజీల నుంచి కూడా డిమాండ్లు రావడంతో ఈ టెస్టులో తీసుకుంటారని అంతా భావించారు. కానీ సిరాజ్‌కు రెండో టెస్టులోనూ నిరాశే మిగిలింది. మరోసారి అతడు బెంచ్‌కు పరిమితమయ్యాడు.

వైభవ్ సొంత బ్రాండ్ క్రియేట్ చేసుకోవాలి

- క్రిస్ గేల్ ప్రశంసలు!

దోహా, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): యూఏఈపై భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ ఆడిన తుఫాన్ ఇన్నింగ్స్ చూసి ‘యూనివర్స్ బాస్’ క్రిస్ గేల్ ఆశ్చర్యపోయాడు. ప్రస్తుతం ఇటాలియా టీ10 లీగ్‌లో ఆడుతున్న క్రిస్ గేల్, వైభవ్ ఆటతీరును కొనియాడాడు. వైభవ్ క్రికెట్ స్వరూపాన్నే మార్చేస్తాడని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. ప్రస్తుతం ఈ కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి. ‘మంగళవారం నా ఫోన్ ఏకధాటిగా మోగుతూనే ఉంది. ఏం జరిగిందా? అని చూస్తే, వైభవ్ సూర్యవంశీ విధ్వంసకర డబుల్ సెంచరీ గురించి తెలిసింది. కేవలం 12 ఓవర్లలోనే ద్విశతకం పూర్తయినట్లు చూసి, మొదట అది టీ20 మ్యాచ్ అనుకున్నాను. కానీ అది వన్డే అని తెలిసి అవాక్కయ్యాను. ఈ కుర్రాడి ఆట చూస్తుంటే త్వరలోనే వన్డేల్లో ట్రిపుల్ సెంచరీ చేయడం ఖాయమనిపిస్తోంది. ఇతడు క్రికెట్ స్వరూపాన్నే మార్చేస్తాడు’ అని క్రిస్ గేల్ ప్రశంసించాడు. అదే విధంగా ప్రత్యర్థి యూఏఈ అయినంత మాత్రాన ఆ ఇన్నింగ్స్‌ను తక్కువ అంచనా వేయలేమని క్రిస్ గేల్ అన్నాడు. ఏ జట్టుపై అయినా ఆ స్థాయిలో విరుచుకుపడడం అంత సులభం కాదని ఆయన అభిప్రాయపడ్డాడు. వైభవ్ ప్రతిభ తగ్గకుండా మరిన్ని అవకాశాలు రావాలని, అతడిని ఎక్కువ మ్యాచ్‌ల్లో ఆడడం చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపాడు. తన నిక్‌నేమ్ ‘యూనివర్స్ బాస్’ తరహాలో వైభవ్‌ను ‘బేబీ బాస్’ అని పిలవడంపైనా క్రిస్ గేల్ స్పందించాడు. అతడిని ‘బేబీ బాస్’ అనడం సరికాదన్నారు. అంతకంటే పెద్ద పేరును వైభవ్ సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. అయితే ‘యూనివర్స్’ మాత్రం ఎప్పటికీ తనదేనంటూ చమత్కరించారు. గతంలో రోహిత్ శర్మకు ‘హిట్‌మ్యాన్’, ఏబీ డివిలియర్స్‌కు ‘మిస్టర్ 360’ ఎలాగో వైభవ్ కూడా తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపును, సొంత బ్రాండ్‌ను సృష్టించుకుంటాడని తాను బలంగా నమ్ముతున్నానని క్రిస్ గేల్ అన్నాడు. కాగా, రైజింగ్ స్టార్స్ ఆసియా కప్ టోర్నీలో మంగళవారం యూఏఈపై జరిగిన మ్యాచ్‌లో వైభవ్ మెరుపు ఇన్నింగ్స్‌తో విధ్వంసం సృష్టించాడు. 53 బంతుల్లోనే 204 పరుగులు బాది ఔరా అనిపించాడు. ఈ ఇన్నింగ్స్‌తో అతడు అనేక రికార్డులు బ్రేక్ చేశాడు. మరోవైపు, వైభవ్ సూర్యవంశీని భారత జట్టు తరఫున రెగ్యులర్‌గా ఆడించాలని, వన్డేల్లోకి వీలైనంత తొందరగా తీసుకోవాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి. కొన్నాళ్లుగా వైభవ్ టీ20 జట్టులో చోటు దక్కించుకుంటున్నా, ఇప్పటివరకు అతడు ఆడింది 10 మ్యాచ్‌లే. ఈ విషయంపై తాజాగా టీమ్ఇండియా మాజీ చీఫ్ సెలక్టర్ క్రిస్ శ్రీకాంత్ స్పందించాడు. వైభవ్‌ను తీర్చిదిద్దుతున్నామని చెబుతూ ఛాన్స్‌లు మాత్రం ఇవ్వడంలేదని విమర్శించాడు. ‘టీమ్ఇండియా మేనేజ్‌మెంట్ కొన్ని బలమైన నిర్ణయాలు తీసుకోవాలి. వైభవ్ బిహార్ జట్టుకు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. దులీప్ ట్రోఫీలో వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఇషాన్ కిషన్‌తో కలిసి దులీప్ టైటిల్‌ను సాధించాడు. వైభవ్ ఆ స్థాయికి ఎదిగినా, హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ మాత్రం ఇవేవీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నాడు. సూర్యవంశీని తీర్చిదిద్దుతున్నామని చెబుతూ జట్టు యాజమాన్యం ఒక ఆట ఆడుతోంది. వైభవ్‌కు అవకాశాలు ఇవ్వడం లేదు. మరోవైపు, ఈ కుర్రాడు తనదైన శైలిలో చెలరేగిపోతున్నాడు. ‘వైభవ్ ఎలా ఆడుతున్నాడో చూడు గౌతమ్. అలా ఎవరూ ఆడలేరు. బంతిని ఇలా కొట్టడం ఎప్పుడైనా చూశారా?’ వైభవ్ ఆడిన షాట్లు చూడండి. అతడు అన్ని వైపులా భారీ షాట్లతో విరుచుకుపడుతున్నాడు. ఇది మరో స్థాయి. క్రికెట్ పుస్తకాల్లో కూడా ఇలాంటి షాట్ల గురించి ప్రస్తావన లేదు. నేను ఇలాంటి షాట్లను ఎప్పుడూ చూడలేదు. ఏబీ డివిలియర్స్, క్రిస్ గేల్ కూడా ఈ స్థాయిలో విధ్వంసం సృష్టించలేదు’ అని క్రిస్ శ్రీకాంత్ పేర్కొన్నాడు.



‘సిరాజ్ కన్నీళ్లు పెట్టుకున్నాడా?’ మురళీ కార్తీక్ కామెంట్స్



క్రైస్ట్‌చర్చ్, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): న్యూజిలాండ్‌తో జరుగుతున్న రెండో టెస్టులోనూ మహ్మద్ సిరాజ్‌కు చోటు దక్కలేదు. తొలి మ్యాచ్‌తో పోలిస్తే, ఈ టెస్టులో భారత్ తుదిజట్టులో ఒక మార్పు జరిగినప్పటికీ, సిరాజ్‌కు మాత్రం మరోసారి నిరాశ ఎదురైంది. పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ స్థానంలో టీమ్ మేనేజ్‌మెంట్ గుర్నూర్ బ్రార్‌ను జట్టులోకి తీసుకుంది. దీంతో సిరాజ్ వివాదం కొనసాగుతూనే ఉంది. ఈ క్రమంలో లైవ్ టీవీ కామెంటేటర్ మాజీ క్రికెటర్ మురళీ కార్తిక్ చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారాయి. జట్టులో చోటు దక్కకపోవడంతో సిరాజ్ ‘భావోద్వేగానికి లోనయ్యాడేమో?’ అని కార్తిక్ వ్యాఖ్యానించాడు. ఈ మ్యాచ్‌లో టాస్ అనంతరం సిరాజ్ సన్‌గ్లాసెస్ ధరించి మైదానంలో నడుస్తూ కనిపించాడు. ఈ సమయంలో అతడి ముఖాన్ని గమనించిన మురళీ కార్తీక్, జట్టులో చోటు దక్కకపోవడం వల్ల సిరాజ్ భావోద్వేగానికి లోనయ్యాడేమోనని అన్నాడు. ‘సిరాజ్ ఏడుస్తున్నాడా?’ అని లైవ్ టెలికాస్ట్‌లో కార్తీక్ ప్యానెల్‌లోని మెంబర్లతో అన్నాడు. అయితే సిరాజ్ కన్నీళ్లు పెట్టుకున్నట్లు ఎక్కడా కనిపించలేదు. కానీ మైదానంలో అతడి ఫేస్ చూస్తుంటే ఎమోషనల్ అయ్యాడేమోనని కార్తిక్ ఈ వ్యాఖ్యలు చేశాడు. “సాధారణంగానే సిరాజ్ భావోద్వేగపూరితమైన వ్యక్తి. ఇలాంటి నిర్ణయాలు అతనికి బాధ కలిగించవచ్చు. కొందరు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించినప్పుడు వాళ్లు పెద్దగా పట్టించుకోరు. ఇంకొందరు ఎలాగైనా టీమ్‌లో రీ ఎంట్రీ ఇవ్వాలని తపిస్తుంటారు. అలాంటి వాళ్లు గాయాలైనా, తలనొప్పిగా ఉన్నా, ఒళ్లు నొప్పులున్నా సరే తమ సర్వస్వాన్ని ధారపోసి ఆడతారు. సిరాజ్ కూడా అలాంటి బౌలరే అనిపిస్తుంది. ఎందుకంటే, కొన్నిసార్లు ఆటగాళ్లు తమ గాయాలను బయటకు చెప్పుకోకుండా దాస్తారు. వన్డే సిరీస్‌ల్లో కూడా సిరాజ్‌ను బెంచ్‌కే పరిమితం చేశారు. వెస్టిండీస్‌తో సిరీస్‌లోనూ, చివరి మ్యాచ్‌లో ఎట్టకేలకు అతడికి అవకాశం ఇచ్చారు. ఇలాంటివి ఒక ఆటగాడికి బాధ కలిగిస్తాయి. అతని గణాంకాలు కూడా గొప్పగా ఉన్నాయి. మరి ఎందుకు ఇలా చేస్తున్నారు. ఒకవేళ అతన్ని ఆడించకూడదనుకుంటే, జట్టులోకి తీసుకోవడం ఎందుకు?” అని కార్తిక్ అన్నాడు. 2020లో సిరాజ్ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు. అయితే గడిచిన ఆరేళ్లలో ఏ సిరీస్‌కైనా సిరాజ్ ఎంపికైతే కనీసం ఒక మ్యాచ్‌లోనైనా బరిలో దిగాడు. అయితే తన కెరీర్‌లో మొట్టమొదటిసారి సిరీస్ మొత్తం బెంచ్‌కే పరిమితం అయ్యాడు. కొంతకాలంగా భారత టెస్టు జట్టులో కీలక సభ్యుడిగా ఉన్న సిరాజ్‌కు, వరుసగా రెండు మ్యాచ్‌లలో అవకాశం దక్కని సందర్భాలు చాలా అరుదు. ప్రస్తుత వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (2025- 2027)లో సిరాజ్ 11 మ్యాచ్‌ల్లో 43 వికెట్లు పడగొట్టాడు.



ముంబయి చా రాజా

కెప్టెన్‌గా రోహిత్ శర్మ నియామకం

ముంబయి, నవంబర్ 27 (ఉద్యమ కెరటం): 2027 ఐపీఎల్‌కు సంబంధించి ముంబయి ఇండియన్స్ ఫ్రాంచైజీ కీలక ప్రకటన చేసింది. వచ్చే సీజన్‌లో తమ జట్టు కెప్టెన్సీ బాధ్యతలను మళ్లీ రోహిత్ శర్మకే అప్పగిస్తున్నట్లు పేర్కొంది. ఈ మేరకు రోహిత్ శర్మను కెప్టెన్‌గా నియమిస్తూ అధికారిక ప్రకటన విడుదల చేసింది. కాగా, రీసెంట్‌గానే ముంబయి ఫ్రాంచైజీ రోహిత్‌ను రూ.16 కోట్లకు రిటైన్ చేసుకుంది. మూడేళ్ల విరామం తర్వాత ఐదుసార్లు ఛాంపియన్ అయిన ముంబయి ఇండియన్స్ జట్టుకు రోహిత్ తిరిగి సారథ్యం వహించనున్నారు. ఇటీవల హార్దిక్ పాండ్యాను పంజాబ్ కింగ్స్‌కు ట్రేడ్ చేయడంతో ఖాళీ అయిన కెప్టెన్సీ పగ్గాలను ఫ్రాంచైజీ తిరిగి తమ అత్యంత విజయవంతమైన నాయకుడి చేతికి అప్పగించింది. మరోవైపు జట్టు ప్రధాన కోచ్‌గా కీరన్ పొలార్డ్ నియమితులు కావడంతో రోహిత్, పొలార్డ్ జోడీ మళ్లీ ముంబయిని విజయపథంలో నడిపిస్తుందని అభిమానులు ఆశిస్తున్నారు.

విద్యార్థికి అండగా రెవల్యూషన్ పాఠశాల



ఉద్యమ కెరటం, మంచిర్యాల: మంచిర్యాల పట్టణంలోని రెవల్యూషన్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న షేక్ ఆమెర్ అనారోగ్యానికి గురికాగా, శుక్రవారం పాఠశాల విద్యార్థులతో పాటుగా వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాఠశాల యాజమాన్యం కలిసి చికిత్స నిమిత్తం రూ.50వేల విరాళాలుగా సేకరించి అస్వస్థతతో ఉన్న విద్యార్థికి అందించి అండగా నిలచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ రావోలు విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలే కాకుండా సమాజం పట్ల అవగాహన, మానవీయ విలువలు, సామాజిక సేవాభావం తదితర గుణాలు కలిగి ఉండడంతో సమాజంతో పాటు దేశ అభివృద్ధి జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వెలుగుమట్లలో తుది దశకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

త్వరలో సీఎం చేతుల మీదుగా కాలనీ ప్రారంభోత్సవం

క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఉద్యమ కెరటం, ఖమ్మం: ఖమ్మం నగరపాలక సంస్థ పరిధిలోని 15వ డివిజన్ వెలుగుమట్లలో నిరుపేదల కోసం నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లతో పాటు కాలనీలో చేపడుతున్న మౌలిక సదుపాయాల పనులను రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శుక్రవారం జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్‌తో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ భూదాన్ భూమిలో నిజమైన నిరుపేదలకు న్యాయం చేయాలనే లక్ష్యంతో 310 ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టినట్లు తెలిపారు. గతంలో కొందరు వ్యక్తులు, సంఘాల పేరుతో పేదలను మోసం చేసి నకిలీ పట్టాలు ఇచ్చి డబ్బులు వసూలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై హైకోర్టు ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ భూదాన్ భూమిని ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకుని, అక్కడ నివసిస్తున్న నిజమైన నిరుపేదలకు ఇళ్లు, మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు చేపట్టినట్లు వివరించారు. ప్రస్తుతం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు దాదాపు పూర్తయ్యాయని, మిగిలిన 10 శాతం పనులను మరో వారం నుంచి పది రోజుల్లో పూర్తి చేయనున్నట్లు వివరించారు. కాలనీలో బస్తీ దవాఖాన, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్, పార్కు, డ్రైనేజీలు, ఓపెన్ జిమ్ వంటి మౌలిక సదుపాయాల పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇళ్ల కాలనీని ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి కేటాయించే తేదీకి అనుగుణంగా అన్ని పనులను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్‌తో పాటు హౌసింగ్, మున్సిపల్ కార్పొరేషన్, సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేయడంతో పాటు కాలనీలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి వారికి న్యాయం చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ కె. శ్రీరామ్, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచంద్ర, నగరపాలక సంస్థ డీఈ నవ్యజ్యోతి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః
UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

ఆదివాసీ అస్తిత్వానికి ఐక్యగళం



- ఘనంగా టీఏజీఎస్ రాష్ట్ర మహాసభలు ప్రారంభం
- మూడు రోజులపాటు ఆదివాసీ హక్కులు, సమస్యలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చలు
- ఎత్మాసూర్ కళా నృత్యాలతో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాల వైభవం
- నేడు భారీ ర్యాలీ.. లుంబిని దీక్షా భూమిలో బహిరంగ సభ
- నేడు ఆసిఫాబాద్‌కు బృందా కరత్

ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి: ఆదివాసీ అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల పరిరక్షణే లక్ష్యంగా తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం (టీఏజీఎస్) నాలుగో రాష్ట్ర మహాసభలు జిల్లా కేంద్రంలోని లుంబిని దీక్షా భూమిలో శుక్రవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివాసీ తెగల సంస్కృతి, సంప్రదాయాలు, కళా వైభవాన్ని ప్రతిబింబించేలా నిర్వహించిన 'ఎత్మాసూర్' సంప్రదాయ కళా నృత్య ప్రదర్శనలు మహాసభలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. మూడు రోజులపాటు జరగనున్న ఈ మహాసభలు ఆదివాసీ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలు, హక్కులు, అభివృద్ధి, భవిష్యత్ పోరాటాలపై చర్చించేందుకు వేదికగా నిలవనున్నాయి.



సంస్కృతి సంప్రదాయాలే ఆదివాసీల అసలైన గుర్తింపు

మహాసభల ప్రారంభ వేడుకల్లో భాగంగా వివిధ ఆదివాసీ తెగలకు చెందిన కళాకారులు తమ సంప్రదాయ దుస్తులు, వాయిద్యాలు, నృత్యాలతో అలరించారు. తరతరాలుగా వస్తున్న ఆదివాసీ జీవన విధానం, ప్రకృతితో ముడిపడిన సంస్కృతి, సామూహిక జీవన విలువలను ఈ ప్రదర్శనలు చాటిచెప్పాయి. ఆదివాసీ సంస్కృతిని కాపాడుకోవడం కేవలం ఒక సామాజిక బాధ్యత మాత్రమే కాకుండా, వారి అస్తిత్వాన్ని భవిష్యత్ తరాలకు అందించే కీలకమైన కర్తవ్యమనే సందేశాన్ని ఈ వేడుకలు అందించాయి.

హక్కుల సాధనకు ఐక్య కార్యాచరణ!

మూడు రోజులపాటు జరిగే మహాసభల్లో ఆదివాసీల భూమి హక్కులు, అటవీ హక్కుల చట్టం అమలు, విద్య, వైద్యం, ఉపాధి, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, స్వయం పాలన, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలపై చర్చలకు ప్రాధాన్యత ఉండనుంది. గిరిజన ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతోపాటు వాటి పరిష్కారానికి భవిష్యత్ కార్యాచరణ రూపొందించుకోవడం ఈ మహాసభల ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా నిలవనుంది.

నేడు భారీ ర్యాలీ.. బహిరంగ సభ

మహాసభల్లో భాగంగా శనివారం జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. అనంతరం లుంబిని దీక్షా భూమిలో బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు టీఏజీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎంపీ మీడియం బాపూరావు అధ్యక్షత వహించనుండగా, ముఖ్య అతిథిగా ఆదివాసీ అధికార రాష్ట్రీయ యువ మంచ్ జాతీయ వైస్ చైర్మన్, మాజీ ఎంపీ బృందా కారత్ హాజరుకానున్నారు. ఆదివారం ప్రతినిధుల సభ నిర్వహించనున్నారు.

పోరాటాలకు దిశానిర్దేశం చేయనున్న మహాసభలు

రాష్ట్రవ్యాప్తంగా ఆదివాసీ ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొంటున్న ఈ మహాసభలు గిరిజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలపై సమిష్టి చర్చకు, హక్కుల సాధనకు భవిష్యత్ ఉద్యమాలకు దిశానిర్దేశం చేసే వేదికగా నిలవనున్నాయి. ఆదివాసీల అభివృద్ధి అంటే కేవలం సంక్షేమ పథకాల అమలు మాత్రమే కాకుండా, వారి భూమి, సంస్కృతి, సంప్రదాయాలు, స్వయం నిర్ణయాధికారాన్ని గౌరవించడం కూడా కీలకమనే అంశాన్ని ఈ మహాసభలు మరోసారి చర్చకు తీసుకురానున్నాయి.

మహాసభ ఏర్పాట్లను పరిశీలించిన రాష్ట్ర నాయకులు

కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో టీఏజీఎస్ రాష్ట్ర 4వ మహాసభల ఏర్పాట్లకు రాష్ట్ర నాయకులు బండారి రవికుమార్, భూపాల్, జిల్లా నాయకులు రాజన్న, దుర్గం దినకర్, రాజేందర్, కృష్ణమాచారి, కార్తీక్, టీకానంద్, మాలశ్రీ, అశోక్, శ్రీనివాస్ దగ్గరుండి పరిశీలించారు. మహాసభకు వచ్చే నాయకులకు, ఆదివాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. రాష్ట్ర మహాసభ కోసం జిల్లా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు.







పేపర్‌లెస్ పాలనకు కాగితాల అడ్డంకులు!

కెరమెరిలో మీసేవ తీరుపై ప్రజల అసంతృప్తి..!

ఆన్‌లైన్‌లో దరఖాస్తులు.. హార్డ్ కాపీల కోసం పట్టుబడుతున్నారన్న ఆరోపణలు!

10 నుంచి 14 రోజులైనా అందని ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు

కార్యాలయానికి వెళ్తేనే ఫైళ్లు కదులుతున్నాయంటున్న బాధితులు!

ఉద్యమ కెరటం, కెరమెరి (కిరణ్): ప్రజలకు ప్రభుత్వ సేవలను వేగంగా, పారదర్శకంగా అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం డిజిటల్ పాలనకు ప్రాధాన్యత ఇస్తోంది. కార్యాలయాల చుట్టూ తిరిగే తిప్పలు తగ్గించి, ఆన్‌లైన్ ద్వారానే దరఖాస్తుల పరిశీలన, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియను సులభతరం చేయాలని భావిస్తోంది. అయితే కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేరమెరి మండలంలో పేపర్‌లెస్ మీసేవ విధానం ఆశించిన స్థాయిలో అమలవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు అందుబాటులో ఉన్నప్పటికీ, హార్డ్ కాపీల పేరుతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి.

ఆన్‌లైన్‌లో ఫైళ్లు.. మళ్లీ హార్డ్ కాపీలు ఎందుకు?

మీసేవ కేంద్రాల ద్వారా ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వెంటనే సంబంధిత అధికారుల లాగిన్‌లకు ఆన్‌లైన్‌లో వివరాలు చేరుతున్నాయి. అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో భౌతిక పత్రాలు సమర్పించాలని సిబ్బంది కోరుతున్నారని దరఖాస్తుదారులు చెబుతున్నారు. ప్రభుత్వం డిజిటల్ విధానాన్ని ప్రోత్సహిస్తున్న తరుణంలో మళ్లీ హార్డ్ కాపీల కోసం కార్యాలయాలకు రావాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతోందని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. హార్డ్ కాపీలు తప్పనిసరైతే అందుకు సంబంధించిన నిబంధనలు ఏమిటో అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు.

రోజులు గడుస్తున్నా అందని సర్టిఫికెట్లు!

ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాలు విద్యార్థుల చదువులు, ఉద్యోగ దరఖాస్తులు, ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పాటు అనేక అవసరాలకు కీలకంగా మారాయి. ఇలాంటి ముఖ్యమైన సర్టిఫికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ 10 నుంచి 14 రోజులు గడుస్తున్నా జారీ కావడం లేదని పలువురు దరఖాస్తుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిర్ణీత సమయంలో సేవలు అందకపోవడంతో అత్యవసర పనుల కోసం ఎదురుచూడాల్సి వస్తోందని వాపోతున్నారు.

కార్యాలయానికి వెళ్తేనే ఫైళ్లకు కదలికనా?

మరోవైపు ఆన్‌లైన్‌లో రోజుల తరబడి పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు, సంబంధిత వ్యక్తులు లేదా మీసేవ నిర్వాహకులు కార్యాలయానికి వెళ్లి హార్డ్ కాపీలు అందించిన తర్వాత త్వరగా ఆమోదం పొందుతున్నాయని కొందరు బాధితులు పేర్కొంటున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే ఆన్‌లైన్ విధానం వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అయితే ఈ జాప్యానికి సాంకేతిక కారణాలున్నాయా? పరిపాలనా పరమైన సమస్యలా? లేక సిబ్బంది పనితీరులో లోపాలున్నాయా? అన్నది అధికారుల పరిశీలనలో తేలాల్సి ఉంది.

కలెక్టర్ స్పందించాలి.. పనితీరును పరిశీలించాలి!

కేరమెరి మండలంలో మీసేవ ద్వారా అందుతున్న ఆదాయ, నివాస ధ్రువీకరణ సేవలపై జిల్లా కలెక్టర్ ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. సంబంధిత అధికారుల లాగిన్‌లలో ఎన్ని దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి .? దరఖాస్తు అందిన తేదీ నుంచి ఆమోదం పొందే వరకు ఎంత సమయం పడుతోంది.. ? జాప్యానికి కారణాలేమిటి? అనే అంశాలపై సమగ్రంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అవసరమైతే సంబంధిత సిబ్బందితో సమీక్ష నిర్వహించి ప్రజలకు నిర్ణీత సమయంలో సర్టిఫికెట్లు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాలనలో మార్పు కనిపించాలి.. ప్రజల కష్టాలు తగ్గాలి!

పేపర్‌లెస్ పాలన అనేది కేవలం ప్రభుత్వ ప్రకటనలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు అనుభవంలోకి రావాలి. సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ ప్రజలు మళ్లీ పాత పద్ధతుల్లోనే కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తే డిజిటల్ పాలన లక్ష్యం నెరవేరినట్లేనా? అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కేరమెరి మండలంలో మీసేవ సేవల తీరును మెరుగుపరిచి, సామాన్యులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకమైన సేవలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

Printed, Published and Owned by **MOHAMMAD ABDUL RAHEMAN,** and Printed at MM Printers, 1-227-3, MM Printers, REBBANA, KUMURAM BHEEM ASIFABAD- 504292, and Published from H.NO. 3-622, BAZARWADI, ASIFABAD, KUMRAMBHEEM ASIFABAD, MANCHERIAL, TELANGANA - 504293. **Editor: MOHAMMAD ABDUL RAHEMAN. PRGI NO : TGTEL/25/A0273** Email: udyamakeratam@gmail.com. Phone No: **9030717172, 9391127717**

రాజంపేటలో డిప్యూటీ కమిషనర్ పర్యటన



ఉద్యమ కెరటం, ఆసిఫాబాద్ రూరల్: పంచాయతీరాజ్ కమిషనర్, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ ఆదేశాల మేరకు డిప్యూటీ కమిషనర్ సుధాకర్ రాజంపేట గ్రామపంచాయతీలో పర్యటించి అభివృద్ధి పనులను పరిశీలించారు. జూబ్లీ మార్కెట్‌లోని చికెన్, మటన్, ఫిష్ మార్కెట్లు, ఇంకుడు గుంతలు, ప్రధాన రహదారి డివైడర్లను తనిఖీ చేశారు. గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో కాలినడకన పర్యటించి పారిశుధ్య నిర్వహణను పరిశీలించారు. అలాగే వి బీ రామ్ జీ ఉపాధి హామీ పనుల పురోగతిని సమీక్షించారు.ఈ పర్యటనలో సర్పంచ్ బుర్సా పోచయ్య, జెడ్పీ సీఈవో లక్ష్మీనారాయణ, డీపీఓ బిక్షపతి గౌడ్, డీఎల్‌పీఓ ఉమర్ హుస్సేన్, ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ మౌనిక, వార్డు సభ్యుల జిల్లా అధ్యక్షుడు గులాం జావిద్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సావర్ ఖేడ్‌లో బస్ స్టాప్ షెడ్ నిర్మాణం



ఉద్యమ కెరటం, కెరమెరి: ప్రయాణికుల సౌకర్యార్థం మండలంలోని సావర్‌ఖేడ్ గ్రామంలో బస్‌స్టాప్ షెడ్ నిర్మాణ పనులను శుక్రవారం గ్రామ సర్పంచ్ కావుడే తులసీరామ్ ప్రారంభించారు. గ్రామానికి ఎక్స్‌ప్రెస్ బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో బస్‌స్టాప్ వద్ద షెడ్ నిర్మాణంతో పాటు అవసరమైన ఏర్పాట్లు చేపట్టారు. గ్రామానికి వచ్చే ప్రయాణికులు, విద్యార్థులు, మహిళలు, వృద్ధులు ఎండ, వానల సమయంలో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామ ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడంతో పాటు మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అన్నక్క దేవరావు, వార్డు సభ్యుడు అనుముల శంకర్, గ్రామ కార్యదర్శి ఎండీ వాజిద్ పాషా, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

మైనారిటీ గురుకులానికి నూతన బోర్డు ఏర్పాటు చేయాలి





ఉద్యమ కెరటం, కామారెడ్డి: కామారెడ్డి మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో నెలకొన్న పలు మౌలిక సదుపాయాల సమస్యలను పరిష్కరించాలని విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాన్ని కోరుతున్నారు. పాఠశాల ప్రధాన రహదారిపై ఏర్పాటు చేసిన బోర్డు పూర్తిగా పాతబడి, దానిపై ఉన్న అక్షరాలు స్పష్టంగా కనిపించకపోవడంతో వెంటనే నూతన బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా పాఠశాల ప్రవేశ ద్వారం వద్ద సంస్థ పేరు తెలిపే బోర్డు కింద పడిపోయి నిరుపయోగంగా ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాఠశాల గుర్తింపు స్పష్టంగా కనిపించేలా నూతన బోర్డును ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ముఖ్యంగా విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పాఠశాల ప్రధాన గేటు వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని పేర్కొంటున్నారు. ఈ సమస్యలపై ప్రిన్సిపాల్ ప్రణీత దృష్టి సారించి, విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారానికే భూ భారతి రీ-సర్వే

జిల్లా కలెక్టర్ కె.హైమావతి

ఉద్యమ కెరటం, సిద్దిపేట: వందేళ్ల నాటి భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భూ భారతి రీ-సర్వే ప్రక్రియను చేపట్టిందని జిల్లా కలెక్టర్ కె.హైమావతి అన్నారు. శుక్రవారం గజ్వేల్ మండలం కోమటిబండ, వర్గల్ మండలం సింగాయపల్లి గ్రామాల్లో జరుగుతున్న భూ భారతి రీ-సర్వే పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పెరిగిన జనాభా, మారిన పరిస్థితుల కారణంగా ఏర్పడిన సర్వే నంబర్ల బై నంబర్లు, భూముల హద్దుల వివాదాలను రీ-సర్వే ద్వారా పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. ముందుగా ప్రభుత్వ, అటవీ, ఇరిగేషన్, రైల్వే శాఖలకు సంబంధించిన భూముల సర్వే పూర్తి చేసి, సంబంధిత శాఖల అధికారుల సంతకాలు తీసుకున్న తర్వాతే పట్టా భూముల సర్వే చేపట్టాలని అధికారులను ఆదేశించారు. సర్వే నిర్వహణకు రెండు రోజుల ముందుగానే రైతులకు సమాచారం అందించాలని, సర్వే సమయంలో రైతులు తమ భూముల వద్ద అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. సర్వేకు ముందు రోజు గ్రామసభ నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేయాలని ఆదేశించారు. అధునాతన రోవర్ యంత్రాల సహాయంతో నిర్దిష్ట రోజువారీ లక్ష్యాల మేరకు కచ్చితత్వంతో, పారదర్శకంగా సర్వే నిర్వహించాలని స్పష్టం చేశారు. సర్వే పూర్తయిన అనంతరం రైతులకు ఏవైనా సందేహాలు ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి రీ-సర్టిఫికేషన్ చేయించుకోవాలని సూచించారు. ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశం ఉన్నందున రైతులు



అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రానున్న రబీ సీజన్‌లో వరి పంటకు బదులుగా ఆరుతడి పంటలను సాగు చేయాలని రైతులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహశీల్దార్లు, సర్వేయర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలి

ఏఎంసీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి

ఉద్యమ కెరటం, ఆదిలాబాద్: అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవం, బాలల హక్కుల మాసోత్సవాల సందర్భంగా జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'బాల్య వివాహ ముక్త భారత్' అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, మున్సిపల్ చైర్ పర్సన్ బండారి అనూష సతీష్ లతో కలిసి ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, జిల్లా విద్యా శాఖ అధికారి



మాధవి, సీడీపీఓ సౌందర్య, సంబంధిత శాఖల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ బాల్య వివాహాలు ఒక సామాజిక దురాచారమని, దీంతో చిన్నారుల భవిష్యత్తు, ఆరోగ్యం, విద్యావకాశాలు దెబ్బతింటాయని తెలిపారు. బాల్య వివాహాల నిర్మూలనకు అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. బాలల హక్కులను కాపాడటం, ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించి సమాజంలో ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రోత్సహించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ పనులు వేగవంతం చేయాలి

జిల్లా కలెక్టర్ కె.హరిత

ఉద్యమ కెరటం, కెరమెరి: మండలంలోని ధనోరా గ్రామంలో నిర్మాణంలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను వేగవంతం చేసి, మరో రెండు నెలల్లోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ధనోరా గ్రామాన్ని సందర్శించి నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పనుల పురోగతి, ప్రస్తుత స్థితిగతులపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ అవసరాలను తీర్చేందుకు నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఇది అందుబాటులోకి వస్తే స్థానిక ప్రజలకు మెరుగైన విద్యుత్ సరఫరా అందించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. నిర్మాణ పనుల్లో





ఎలాంటి జాప్యం జరగకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం కెరమెరి ప్రాంతంలో అమలవుతున్న డీఏ-జుగా కార్యక్రమ పనుల పురోగతిపై సంబంధిత అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ డేవిడ్, ఆసిఫాబాద్ ఆపరేషన్ ఎస్ఈ ఉత్తమ్ జాడే, విద్యుత్ శాఖకు చెందిన సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, తాను జీవించి ఉన్నంతకాలం వారి బాధ్యతను తానే తీసుకుంటానని సిరిసిల్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి స్పష్టం చేశారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు, సముచిత న్యాయం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. శుక్రవారం గంభీరావుపేట మండల కేంద్రంలో ఏఎంసీ నూతన చైర్మన్ మహమ్మద్ హమీద్, వైస్ చైర్మన్ భాస్కర్, డైరెక్టర్లను వారి కార్యాలయంలో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా గంభీరావుపేట పీఏసీఎస్ చైర్మన్ వెంకటి, వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, డైరెక్టర్లను సత్కరించారు. మాజీ ఏఎంసీ చైర్మన్ కొమిరిశెట్టి విజయ, మాజీ డైరెక్టర్‌ను కూడా ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి అండగా నిలిచి, అనేక ఇబ్బందులు ఎదుర్కొంటూ కేసులను సైతం ఎదుర్కొన్న కార్యకర్తలను రాబోయే రోజుల్లో తగిన విధంగా గుర్తిస్తామని తెలిపారు. గత బీఆర్ఎస్ పాలనలో అతివృష్టి, అనావృష్టి పరిస్థితులు ఎదురైనప్పుడు రైతుల సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం పంట నష్టపరిహారం అందిస్తూ రైతులకు అండగా నిలుస్తోందని అన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిరంతరం రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్ష హన్మాండ్లు, మాజీ జిల్లా ఉపాధ్యక్షులు కొమిరిశెట్టి తిరుపతి, నాయకులు గంగి స్వామి, ఎలుక రాజు, నుస్రత్, గాడిచర్ల శ్రీనివాస్, స్టీఫెన్, రామచంద్రారెడ్డి, నర్సింలు, మల్లయ్య, లక్ష్మణరావు, అంజా గౌడ్,



శంకర్, బంగ్లా రాజు, బేకుమల్ల ప్రవీణ్, ప్రభాకర్, నాంపల్లి, సతీష్ రెడ్డి, భూమరాజం, రాజం, శ్రీనివాస్, సంతోష్ గౌడ్, మధుసూదన్ రెడ్డి, రమేష్ గౌడ్, శ్రీజ, మురళి నాయక్, రఘువీరా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

29న అలుగునూర్‌లో దీక్షా దివస్ బహిరంగ సభ

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం అప్పటి టీఆర్ఎస్ అధినేత, ప్రస్తుత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్ష తెలంగాణ ఉద్యమ చరిత్రలో కీలక మలుపుగా నిలిచిందని నాఫ్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు అన్నారు. ఆనాడు కేసీఆర్ ఇచ్చిన 'తెలంగాణ వచ్చుడో.. కేసీఆర్ సచ్చుడో' అనే నినాదం ఉద్యమానికి ఆయుధంగా మారి యువతలో పోరాట స్ఫూర్తిని నింపిందని పేర్కొన్నారు. దీక్షా దివస్ సన్నాహక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం సాగిన ఉద్యమ చరిత్రను నేటి యువత, యువ నాయకులు, భావితరాలకు తెలియజేయడమే దీక్షా దివస్ స్ఫూర్తి సభ ప్రధాన ఉద్దేశమని వివరించారు. ఈనెల 29న కరీంనగర్ జిల్లా అలుగునూర్‌లో దీక్షా దివస్ బహిరంగ



సభను ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎందరో అమరవీరుల త్యాగాలు, ఉద్యమకారుల అలుపెరుగని పోరాట ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిందని అన్నారు. ఆనాటి ఉద్యమ స్ఫూర్తిని మరోసారి చాటిచెప్పేందుకు నిర్వహించే దీక్షా దివస్ బహిరంగ సభకు ప్రతి ఇంటి నుంచి కనీసం ఒక్కరైనా తరలివచ్చి సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో కొత్తపల్లి గ్రామ సర్పంచ్ బాలరాజు గౌడ్, సెస్ డైరెక్టర్ గౌరినేని నారాయణరావు, సురేందర్ రెడ్డి, రాజు, కమ్మరి గ్రామ శాఖ అధ్యక్షుడు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యమ కెరటం
నిజం రక్షతి రక్షితః UDYAMAKERATAM TELUGU DAILY తెలుగు దినపత్రిక

వీవో భవన నిర్మాణంపై వివాదం.. గ్రామపంచాయతీ సమావేశం బహిష్కరణ

- సర్పంచ్ భర్త ఏకపక్ష వైఖరిపై ఉప సర్పంచ్ నిరసన
- విద్యా ప్రాంగణంలో భవన నిర్మాణం వద్దంటూ 13 మంది వార్డు సభ్యుల అభ్యంతరం



ఉద్యమ కెరటం, గంభీరావుపేట: గంభీరావుపేట మేజర్ గ్రామపంచాయతీలో వీవో సంఘ భవన నిర్మాణం వ్యవహారం వివాదానికి దారితీసింది. గ్రామపంచాయతీ పాలకవర్గ తీర్మానాలు, వార్డు సభ్యుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా సర్పంచ్ భర్త మల్లుగారి నర్సాగౌడ్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తూ ఉప సర్పంచ్ లక్కిరెడ్డి కమలాకర్ రెడ్డి గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం నిర్వహించిన గ్రామపంచాయతీ జనరల్ బాడీ సమావేశాన్ని బహిష్కరించారు. ఈ సందర్భంగా ఉప సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం తొమ్మిది వీవో సంఘ భవనాల నిర్మాణానికి గతంలో గ్రామపంచాయతీలో తీర్మానాలు చేసినప్పటికీ, వాటికి సంబంధించిన స్థలాల ఎంపిక ఇంకా పూర్తికాలేదని తెలిపారు. అయితే తొమ్మిదో వీవో సంఘ భవనాన్ని కేజీ టు పీజీ విద్యా ప్రాంగణంలోని ఉర్దూ మీడియం పాఠశాల పక్కన నిర్మించడాన్ని తాము వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. విద్యా ప్రాంగణంలో భవన నిర్మాణం చేపడితే భవిష్యత్తులో విద్యాసంస్థల అభివృద్ధికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందన్నారు. కేజీ టు పీజీ పరిసర ప్రాంతం భవిష్యత్తులో ఎడ్యుకేషన్ హబ్‌గా అభివృద్ధి చెందే అవకాశమున్నందున అక్కడ ఇతర నిర్మాణాలు చేపట్టడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు వినతిపత్రం అందించడంతో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గంలో తీర్మానాన్ని ప్రవేశపెట్టి ఓటింగ్ నిర్వహించినట్లు తెలిపారు. వీవో భవన నిర్మాణానికి అనుకూలంగా ముగ్గురు మాత్రమే ఉండగా, నిర్మాణం చేపట్టవద్దంటూ 13 మంది వార్డు సభ్యులు సంతకాలు చేసి తమ అభ్యంతరాన్ని తెలియజేశారని వివరించారు. గ్రామ అభివృద్ధికి తాము ఎల్లప్పుడూ సహకరిస్తామని, అయితే విలువైన విద్యా ప్రాంగణ స్థలంలో భవన నిర్మాణం చేపట్టడం సమంజసం కాదన్నారు. వీవో భవనానికి ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేసి నిర్మాణం చేపట్టాలని సూచించినప్పటికీ తమ అభిప్రాయాలను పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల చిరకాల వాంఛ అయిన ప్రధాన రహదారి విస్తరణపై కూడా గ్రామపంచాయతీ స్పష్టమైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రోడ్డు విస్తరణకు చర్యలు తీసుకోకుండా ప్రస్తుతం ఉన్న రహదారిలోనే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రహదారి విస్తరణపై పాలకవర్గం తన వైఖరిని ప్రజలకు స్పష్టం చేయాలని కోరారు. ఈ నిరసనకు వార్డు సభ్యులు పిట్ల శ్రీమతి, చిలుక ప్రశాంత్ మద్దతు తెలిపారు.

సాగుకు ఎగువ మానేరు నీటిని వెంటనే విడుదల చేయాలి

- కామారెడ్డి–సిద్దిపేట ప్రధాన రహదారిపై రైతుల ధర్నా

ఉద్యమ కెరటం, గంభీరావుపేట: యాసంగి పంట సాగు కోసం నర్మాల ఎగువ మానేరు జలాశయం నుంచి వెంటనే సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ గంభీరావుపేట మండల కేంద్రంలో రైతులు ఆందోళన చేపట్టారు. శుక్రవారం తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద కామారెడ్డి–సిద్దిపేట ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. నర్మాల, లింగన్నపేట, మల్లారెడ్డిపేట, గంభీరావుపేట గ్రామాలకు చెందిన రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని సాగునీరు విడుదల చేయాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ యాసంగి పంట సాగుకు నార్లు పోసుకునే సమయం సమీపిస్తున్నప్పటికీ ఎగువ మానేరు జలాశయం నుంచి నీటిని విడుదల చేయక పోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఎగువ మానేరు జలాశయం పూర్తిస్థాయి నీటి నిల్వ సామర్థ్యం 2 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 1.75 టీఎంసీల నీరు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. మల్లన్నసాగర్ నుంచి అర టీఎంసీ నీటిని విడుదల చేసి, ఎగువ మానేరు ద్వారా ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని ప్రభుత్వాన్ని, సంబంధిత అధికారులను కోరారు. డిసెంబర్ 5వ తేదీలోగా సాగునీటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నిర్దిష్ట గడువులోగా నీటిని విడుదల చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. రైతుల సాగు అవసరాలను దృష్టిలో ఉంచుకుని అధికారులు తక్షణమే స్పందించి నీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్థానిక తహశీల్దార్



మారుతి రెడ్డికి అందజేశారు. ఈ ధర్నాలో రైతులు ఏడబోయిన రాజు, ఆకునూరి రాజేందర్, తోట్ల మల్లేష్, గుండెల్లి కళ్యాణ్, పంపరి మహేష్, దాసరి చంద్రం, జక్కుల నవీన్, మల్లేశం, రవీందర్ రావు, వెంకట్, నర్సింలు, నారాయణ, గోపాల్, పెద్దవేణి వెంకట్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

మేనూర్ అంగడిలో ట్రాఫిక్ సమస్యలు

ప్రజలకు తప్పని ఇబ్బందులు

ఉద్యమ కెరటం, మద్నూర్: మండలంలోని మేనూర్ గ్రామంలో ప్రతి శుక్రవారం నిర్వహించే వారపు అంగడిలో ట్రాఫిక్ సమస్యలు ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు కొనుగోళ్ల కోసం అంగడికి తరలివస్తుండటంతో రద్దీ పెరుగుతోంది. అంగడి ప్రాంతంలో కూరగాయల వ్యాపారులు, ఇతర దుకాణదారులు రోడ్డుకు ఇరువైపులా వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. భారీ వాహనాలు, ద్విచక్ర వాహనాలు ఒకేసారి రాకపోకలు సాగిస్తుండటంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా సరుకులతో వచ్చే లారీలు రహదారిపై నిలిపి



వేయడం ద్వారా వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. అంగడికి వచ్చే మహిళలు, వృద్ధులు, చిన్నపిల్లలు రద్దీ మధ్య రాకపోకలు సాగించే టప్పుడు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సంబంధిత అధికారులు స్పందించి ప్రతి శుక్రవారం అంగడి సమయంలో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. భారీ వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతో పాటు, వ్యాపారులు రహదారులకు ఆటంకం కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని మేనూర్ అంగడి ప్రాంతంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు శాశ్వత పరిష్కారం చూపాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

భూసిమెట గురుకులంలో విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి

ఉద్యమ కెరటం, జైనూర్: మండలంలోని భూసిమెట గురుకుల పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆదివాసీ విద్యార్థి సంఘం నాయకులు శుక్రవారం పరిశీలించారు. పాఠశాలలో హాస్టల్ వసతులు, నాణ్యమైన భోజనం, స్వచ్ఛమైన తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ వంటి కనీస సౌకర్యాల విషయంలో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించాలని, నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని స్వచ్ఛమైన తాగునీటి సౌకర్యం కల్పించడంతో పాటు మరుగుదొడ్లను నిత్యం పరిశుభ్రంగా నిర్వహించాలని సూచించారు. ఆదివాసీ





విద్యార్థుల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తు విషయంలో నిర్లక్ష్యం చేయకుండా సంబంధిత అధికారులు వెంటనే స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు పెందోర్ సంతోష్, జైనూర్ మండల అధ్యక్షుడు కుంరం సుధాకర్, సంఘం గౌరవ అధ్యక్షుడు పెందోర్ కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి, సలహాదారు సీడాం భీంరావు, కోట్నాక్ శ్రీరామ్, ఏఎస్పీ మండల అధ్యక్షుడు కోట్నాక్ శ్యాంరావు, తుడుం దెబ్బ నాయకుడు గేడం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

జిల్లా కలెక్టర్ కె.హైమావతి

ఉద్యమ కెరటం, సిద్దిపేట: జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే సామాన్య ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ కె.హైమావతి వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణీలు గర్భం దాల్చినప్పటి నుంచి ప్రసవం అయ్యే వరకు ప్రత్యేక వైద్య పర్యవేక్షణ అందించాలని సూచించారు. తల్లీబిడ్డల మరణాలను, అనవసర సిజేరియన్ ప్రసవాలను తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డెంగ్యూ, మలేరియా, డయేరియా వంటి సీజనల్ వ్యాధుల నివారణకు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు డెంగ్యూ వంటి వ్యాధులకు సొంతంగా చికిత్సలు చేయకుండా పర్యవేక్షణ చేపట్టాలన్నారు. 30 ఏళ్లు దాటిన ప్రతిఒక్కరికీ బీపీ, షుగర్, నోటి, రొమ్ము క్యాన్సర్ పరీక్షలు నిర్వహించాలని, టీబీ నివారణకు ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆసుపత్రుల్లో ప్రతిరోజూ రక్త నమూనాలు సేకరించి టీ-హబ్‌కు పంపాలని, ఈ-సంజీవని, ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ సేవలను విస్తరించాలని తెలిపారు. వైద్యులు, సిబ్బంది విధులకు సకాలంలో హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని, సమయపాలన పాటించని, విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉత్తమ పనితీరు కనబర్చిన వైద్యులను అభినందించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ధనరాజ్, ప్రోగ్రాం అధికారులు డాక్టర్ వినోద్, డాక్టర్ మీనా కుమారి, డిప్యూటీ



డీఎంహెచ్ఓలు డాక్టర్ మహేందర్ రెడ్డి, డాక్టర్ శ్రీకాంత్, డాక్టర్ సుధీర్ రాజ్, డెమో నవీన్ రాజ్, టీ-హబ్ మేనేజర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గోజెగావులో ఇందిరమ్మ జీవిత బీమా పథకం ప్రారంభం



ఉద్యమ కెరటం, మద్నూర్: పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని మద్నూర్ మండలంలోని గోజెగావు గ్రామంలో సర్పంచ్ భరత్ రాథోడ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ధరస్వర్ సాయిలు, ఎంపీడీవో సాయిలు, ఎంపీవో సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాట్లాడుతూ ఇందిరమ్మ జీవిత బీమా పథకం ద్వారా అర్హులైన పేద కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా భరోసా లభిస్తుందని తెలిపారు. కుటుంబ పెద్దకు అనుకోని ప్రమాదం, మరణం సంభవించిన సందర్భంలో కుటుంబానికి ఆర్థిక భద్రత కల్పించడంలో ఈ పథకం ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ శశిరేఖ, మెంబర్ మాధవ్ పటేల్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శివాజీ రాథోడ్, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పానాపటార్ గ్రామ సమస్యలపై ఐటీడీఏ పీఓకు వినతి



ఉద్యమ కెరటం, జైనూర్: పానాపటార్ గ్రామపంచాయతీ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించి, గ్రామ అభివృద్ధికి అవసరమైన నిధులు కేటాయించాలని పానాపటార్ సర్పంచ్ ఆత్రం తులసి పేర్కొన్నారు. శుక్రవారం ఉట్నూర్ ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి మంద మకరందును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి గ్రామ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రధాన సమస్యలను పీఓ దృష్టికి తీసుకెళ్లారు. అర్హులైన లబ్ధిదారులందరికీ పీఎం జన్మన్, ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, పానాపటార్ గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు. అన్ని గ్రామాలకు అంతర్గత రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి బోరుబావులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పీఓ సానుకూలంగా స్పందించారు. త్వరలో పానాపటార్ గ్రామాన్ని సందర్శించి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిశీలిస్తానని, గ్రామానికి అవసరమైన నిధులు కేటాయించి అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఆత్రం భీంరావు, వీఓఏ సిడాం భీంరావు, మాడావి బాలాజీ, ఆత్రం జగన్ తదితరులు పాల్గొన్నారు.

ఆరో రోజుకు చేరిన రిలే నిరాహార దీక్షలు



ఉద్యమ కెరటం, జవహర్‌నగర్: రాంకీ చెత్త డంపింగ్ యార్డును వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. లక్షలాది మంది ప్రజల ఆరోగ్యానికి ముప్పుగా మారిన డంపింగ్ యార్డును తొలగించి పర్యావరణాన్ని కాపాడాలని జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్ ఎత్తివేత పోరాట కమిటీ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ, ప్రజా సంఘాలు ఉద్యమిస్తున్నాయి. ఇప్పటికే ముఖ్యమంత్రి, జిల్లా కలెక్టర్, హెచ్ఎండీఏ అధికారులతో పాటు ప్రజాప్రతినిధులకు వినతిపత్రాలు అందజేసి, పాదయాత్రలు, ధర్నాలు నిర్వహించినా స్పందన లేకపోవడంతో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. దీక్షా శిబిరాన్ని సందర్శించిన వివిధ పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజల సహనాన్ని పరీక్షించకుండా వెంటనే డంపింగ్ యార్డును తొలగించాలని డిమాండ్ చేశారు. పరిస్థితి మరింత ఉద్రిక్తం కాకముందే పాలకవర్గాలు స్పందించాలని, లేనిపక్షంలో రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో ప్రజల ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ దీక్షల్లో సీపీఎం, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ, మాస్ లైన్, బీఎస్పీ, ఏఐఎఫ్‌టీయూ, బహుజన సత్తా, టీయూ జేఏసీ నాయకులు పాల్గొన్నారు. గడ్డం సదానందం, డి. స్వరూప, పి. శివబాబు, వి. జయసుధ, కొన్నే వేణు, దర్శనం యాదగిరి, సురేందర్, కల్లెపు చంద్రన్న ప్రసాద్, కవిత తదితరులు సంఘీభావం తెలిపారు.

పెండింగ్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలి

జిల్లా అదనపు కలెక్టర్ రాములు



ఉద్యమ కెరటం, మంచిర్యాల: పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని మంచిర్యాల మండల తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులు, పెండింగ్ దరఖాస్తులు, వివిధ ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించి, వివిధ రెవెన్యూ అంశాల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రెవెన్యూ పరిధిలో పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను నిబంధనలకు లోబడి పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. హైకోర్టు కేసులకు సంబంధించి సిసిఎంఎస్ స్థితిగతులు, ఎఎస్ డిడి రోజువారీ నివేదికల పరిష్కారం, భూభారతి పాత, కొత్త పెండింగ్ దరఖాస్తులు, జీఓ నం.58, 59 క్రింద భూముల క్రమబద్ధీకరణ దరఖాస్తులు, భూదాన్ భూములు, మీ-సేవ ధృవీకరణ పత్రాల పెండింగ్ దరఖాస్తులు, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ దరఖాస్తులు, ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పారదర్శకంగా సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ మార్గదర్శకాలను సమర్థవంతంగా అమలు చేస్తూ, ప్రతి అంశంపై ప్రత్యేక దృష్టి సారించి పెండింగ్ పనులను పూర్తి చేయాలని సూచించారు.